ONE click
ePaper
www.shanmukhavelugu.com

RNI : APTEL / 2023 / 89152

షణ్ముఖ
SHANMUKHAVELUGU
వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక

Good for Health
Best for Readers
PL.NO.IR/RNP/SV/26/2026

సంపుటి : 03 సంచిక : 204
ఆదివారం 02 ఆగస్టు 2026 పేజీలు 8 వెల : రూ.3

Printed by Ongole. Published From Ongle, Nellore, Guntur, Markapur, Bapatla.

# భోగాపురం ఎయిర్‌పోర్టు ఉత్తరాంధ్రకు మణిహారం...

## సరికొత్త చరిత్రకు నాంది పలికాం



- ఉత్తరాంధ్రలో సరికొత్త చరిత్ర ప్రారంభమైందన్న సీఎం చంద్రబాబు
- భోగాపురం ఎయిర్‌పోర్టును ఉత్తరాంధ్రకు మణిహారంగా అభివర్ణన
- భూములిచ్చిన రైతులకు పాదాభివందనం చేస్తున్నట్లు వెల్లడి
- అవహేళన చేసిన వారు ఇప్పుడు అడ్రస్ లేకుండా పోయారన్న సీఎం
- రాష్ట్రాన్ని పునర్నిర్మిస్తామన్న మాట నిలబెట్టుకుంటున్నామని స్పష్టీకరణ





(షణ్ముఖ వెలుగు, భోగాపురం,ఆగస్టు 01)

భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ఉత్తరాంధ్రకు మణిహారం లాంటిదని, ఈ ప్రాంత దశ, దిశను మార్చే శక్తి దీనికి ఉందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. విజయనగరం జిల్లా భోగాపురంలో 'అల్లూరి సీతారామరాజు విమానాశ్రయం' ప్రారంభోత్సవ సభలో ఆయన ప్రసంగించారు. ఒకప్పుడు ఈ ప్రాంతానికి ఎర్రబస్సు కూడా రాదంటూ అవహేళన చేసిన వారు ఇప్పుడు అడ్రస్ లేకుండా పోయారని, కానీ నేడు ఇక్కడకు ఎయిర్‌బస్ వచ్చిందని వ్యాఖ్యానించారు. అభివృద్ధికి అడ్డుపడిన శక్తులను ప్రజలు తిరస్కరించారని అన్నారు.

ఈ విమానాశ్రయానికి భూములిచ్చిన రైతులు ఉత్తరాంధ్ర కొత్త చరిత్రకు శ్రీకారం చుట్టారని చంద్రబాబు ప్రశంసించారు. "రెండేళ్ల క్రితం విధ్వంసమైన రాష్ట్రాన్ని పునర్ నిర్మిస్తామని ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో నేను, పవన్ కల్యాణ్ హామీ ఇచ్చాం. ఆ హామీని నిలబెట్టుకున్నాం" అని ఆయన తెలిపారు. ఉత్తరాంధ్ర శక్తికి నిదర్శనంగా నిలిచే ఈ విమానాశ్రయానికి స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు పేరు పెట్టడం గర్వకారణమని అన్నారు. ఉత్తరాంధ్ర వాసి జీఎమ్మార్ ఈ ఎయిర్‌పోర్టును నిర్మించడం, దీనికి తొలి అడుగులు వేసిన అశోక్ గజపతిరాజు, ప్రస్తుత కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు కూడా ఈ ప్రాంతం వారే కావడం విశేషమని గుర్తుచేశారు. ▶2లో

### స్వర్ణాంధ్ర విజన్‌కు ఇదొక శుభదినం: మోదీ

ఏపీ అభివృద్ధిలో ఇవాళ కీలకమైన రోజు.. స్వర్ణాంధ్రప్రదేశ్ విజన్‌కు ఇదొక శుభ దినం అని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్నారు. భోగాపురంలో నూతనంగా నిర్మించిన అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయాన్ని ప్రధాని జాతికి అంకితం చేశారు. రూ.18వేల కోట్ల విలువైన ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్స వాలు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ప్రధాని మాట్లాడారు. అందరికీ నమస్కారం అంటూ తెలుగులో ప్రసంగం ప్రారంభించిన మోదీ.. సింహాచలం అప్పన్న, పైడితల్లి అమ్మవారికి ప్రణామాలు తెలిపారు. పవిత్రమైన ఉత్తరాంధ్రకు వచ్చే అదృష్టం దక్కిందని మోదీ అన్నారు.

### ఉత్తరాంధ్రకు భోగాపురం ఎయిర్‌పోర్ట్ కొత్త అధ్యాయం..

(షణ్ముఖ వెలుగు, భోగాపురం,ఆగస్టు 01)

ఉత్తరాంధ్ర అభివృద్ధిలో భోగాపురం ఎయిర్‌పోర్ట్ కీలకమన్న పవన్
దేశాన్ని మోదీ ప్రగతి పథంలో నడిపిస్తున్నారని ప్రశంస

చంద్రబాబు మార్గనిర్దేశంలో ఏపీ అగ్రగామి రాష్ట్రంగా మారుతుందని ధీమా ప్రధాని మోదీని విమర్శించడం తనను బాధించిందని వ్యాఖ్య ఉత్తరాంధ్ర అభివృద్ధిలో భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ఒక సరికొత్త అధ్యాయాన్ని



లిఖించబోతోందని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మార్గదర్శకత్వంలో ఆంధ్రప్రదేశ్ అగ్రగామి రాష్ట్రంగా మారబోతోందని ధీమా వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంపై ప్రశంసలు కురిపించారు. ప్రధాని మోదీ 140 కోట్ల మంది ప్రజల ఆకాంక్షలను నెరవేరుస్తూ దేశాన్ని 'వికసిత్ భారత్' దిశగా వేగంగా నడిపిస్తున్నారని పవన్ కొనియాడారు. ఆయన నాయకత్వంలో దేశం ప్రగతి పథంలో దూసుకుపోతోందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ ఎదుర్కొన్న విమర్శలను పవన్ గుర్తుచేసుకున్నారు. గతంలో ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ప్రధానిని కొందరు విమర్శిస్తున్నప్పుడు తాను చాలా బాధపడ్డానని తెలిపారు. ఎన్ని అవమానాలు ఎదురైనా, వెనక్కి లాగే ప్రయత్నాలు జరిగినా మోదీ ఎక్కడా భయపడలేదని ప్రశంసించారు. ▶2లో

### ప్రతిపక్షాల హేళనలకు అభివృద్ధితో సమాధానమిచ్చాం

భోగాపురం విమానాశ్రయాన్ని జాతికి అంకితం చేసిన ప్రధాని మోదీ

ఉత్తరాంధ్ర అభివృద్ధికి ఈ విమానాశ్రయం సింహద్వారంలా నిలుస్తుందన్న రామ్మోహన్ నాయుడు

ఉత్తరాంధ్రలో ప్రగతి పరుగులు పెడుతోందని వ్యాఖ్య



(షణ్ముఖ వెలుగు, భోగాపురం,ఆగస్టు 01)

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేతుల మీదుగా భోగాపురం అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం జాతికి అంకితమైన చారిత్రాత్మక ఘట్టంతో ఇప్పుడు ప్రపంచం మొత్తం ఉత్తరాంధ్ర వైపు చూస్తోందని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు ఆనందం వ్యక్తం చేశారు. విమానాశ్రయ ప్రారంభోత్సవం అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ, ▶2లో

### 'అర్థమైందా రాజా!'..

#### ఎర్ర బస్సు రాదన్న చోట ఎయిర్‌పోర్టు వచ్చింది



- ఎర్ర బస్సు రాదన్న చోట విమానాశ్రయం నిర్మించామన్న లోకేశ్
- ఉత్తరాంధ్ర ప్రజలను అవమానించిన వారికి గట్టి జవాబు అని వ్యాఖ్య
- ప్రధాని మోదీ సహకారంతోనే ఏపీలో అభివృద్ధి పనులు అన్న మంత్రి
- కొత్త విమానాశ్రయం ఏపీకి పవర్ ఇంజిన్‌గా మారుతుందన్న ధీమా ▶2లో

### శభాష్ లోకేశ్.. భుజం తట్టిన ప్రధాని మోదీ

మంత్రి నారా లోకేశ్‌ను ప్రశంసించిన ప్రధాని మోదీ

భోగాపురం ఎయిర్‌పోర్ట్ ప్రారంభోత్సవం తర్వాత ఘటన

"శెభాష్, బాగా పనిచేస్తున్నావు" అంటూ భుజం తట్టిన ప్రధాని

ఇదే స్ఫూర్తితో పనిచేయాలని లోకేశ్‌కు సూచన

గతంలోనూ లోకేశ్ కృషిని మెచ్చుకున్న మోదీ



(షణ్ముఖ వెలుగు, భోగాపురం,ఆగస్టు 01)

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ఆంధ్రప్రదేశ్ మంత్రి నారా లోకేశ్ పనితీరును ప్రశంసించారు. "శెభాష్ లోకేశ్, చాలా బాగా పనిచేస్తున్నావు" అంటూ ఆయన భుజం తట్టి అభినందించారు. ఇదే వేగం, స్ఫూర్తితో ప్రజాసేవలో ముందుకు సాగాలని లోకేశ్‌కు సూచించారు. విజయనగరం జిల్లా భోగాపురంలో నూతనంగా నిర్మించిన అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయ ప్రారంభోత్సవ కార్యక్రమం అనంతరం ఈ ఆసక్తికర ఘటన చోటుచేసుకుంది. కార్యక్రమం ముగించుకుని తిరిగి వెళుతున్న ప్రధాని మోదీకి రాష్ట్ర ఐటీ, విద్యాశాఖల మంత్రి నారా లోకేశ్ వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ప్రధాని ఆప్యాయంగా లోకేశ్‌తో మాట్లాడి, ఆయన పనితీరుపై ప్రశంసలు ▶2లో

### భోగాపురం ఎయిర్ పోర్టు క్రెడిట్ వార్..

ప్రాజెక్టుకు పునాది వేసింది జగనే అన్న వైసీపీ

అన్ని అనుమతులు జగన్ హయాంలోనే సాధించామని వెల్లడి

ప్రాజెక్టు విజయంలో చంద్రబాబు పాత్ర లేదన్న వైసీపీ

(షణ్ముఖ వెలుగు, భోగాపురం,ఆగస్టు 01)

భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ఇవాళ ప్రధాని మోదీ చేతుల మీదుగా ప్రారంభమయింది.



మరోవైపు, ఎయిర్‌పోర్టు ప్రారంభోత్సవంపై వైసీపీ ఎక్స్ వేదికగా ట్వీట్ చేసింది. భోగాపురం ఎయిర్‌పోర్టు సాకారమవ్వడంపై మాజీ సీఎం జగన్ తరపున ప్రజలకు వైసీపీ ధన్యవాదాలు తెలిపింది. ఈ ప్రాజెక్టుకు పునాది వేసి, కల నుంచి నిజం దిశగా నడిపించిన నాయకుడు ఎవరో రాష్ట్ర ప్రజలకు ▶2లో

# లబ్ధిదారులకు పెన్షన్ పంపిణీ చేసిన టీడీపీ నాయకులు



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఆగస్టు 1)
ఒంగోలు నియోజకవర్గ ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు ఆదేశాల మేరకు ఒంగోలు నగరంలోని 48వ డివిజన్‌లో రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న లబ్ధిదారులకు వారి ఇంటి వద్ద పెన్షన్ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. అర్హులైన లబ్ధిదారులకు పెన్షన్లు



అందజేస్తూ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు పాదర్తి సుబ్బారావు, డివిజన్ అబ్జర్వర్ పాలపర్తి లక్ష్మీనారాయణ, గుమ్మళ్ల సుబ్బారావు, 63వ బూత్ ఇన్‌చార్జి పాలపర్తి సురేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

# అంగన్వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు






(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, ఆగస్టు 1)
మండలంలోని లింగారెడ్డిపల్లి అంగన్వాడీ కేంద్రం నందు శనివారం ప్రపంచ తల్లిపాల వారోత్సవాలులో భాగంగా తొలి రోజు గ్రామంలో ర్యాలీని ఐసిడిఎస్ సూపర్వైజర్ ఎంవిఎస్ పార్వతి ప్రారంభించారు. పార్వతి ర్యాలీలో తల్లిపాలే ముద్దు-డబ్బా పాలు వద్దు, తల్లిపాలను ప్రోత్సహిద్దాం-ఆరోగ్యవంతమైన భవిష్యత్తును నిర్మిద్దాం అని తల్లిపాల ప్రాముఖ్యత పై నినాదాలు చేశారు. తదుపరి అంగన్వాడి కేంద్రం నందు గర్భవతులు, బాలింతలు, కిషోర బాలికలతో సమావేశం నిర్వహించి వారిని ఉద్దేశించి సూపర్వైజర్ పార్వతి మాట్లాడారు. బిడ్డ పుట్టిన వెంటనే గంటలోపే తల్లి ముర్రుపాలు తాగించాలని, అవి మొదటి టీకా వలె పని చేస్తాయని, వ్యాధి నిరోధక శక్తిని పెంపొందించి, బిడ్డ ఆరోగ్యాన్ని కాపాడతాయని, ఆరు నెలల వరకు కేవలం తల్లిపాలే ఇవ్వాలని, ఎటువంటి పానీయాలు ఇవ్వవద్దన్నారు. ఆరు నెలల తర్వాత తల్లిపాలతో పాటు అనుబంధ పోషకాహారమును కలిపి ఇవ్వాలని, 2 సంవత్సరములు వరకు తల్లిపాలే ఇవ్వాలని, తల్లిపాలు ఇవ్వడం వల్ల గర్భాశయ, రొమ్ము క్యాన్సర్ బారిన పడకుండా ఆరోగ్యంగా ఉంటారని, తద్వారా ఆరోగ్యకరమైన సమాజం జాతీయ అభివృద్ధికి దోహదపడుతుందని తల్లిపాల ప్రాముఖ్యతను గూర్చి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమం 1 నుండి 7వ తేదీ వరకు అంగన్వాడీ కార్యకర్తలు తల్లులకు అవగాహన కలిగిస్తారని అన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు సరస్వతి, జ్యోతి, ధనమ్మ, హెల్పర్ భాగ్యలక్ష్మి, గ్రామంలో గర్భిణులు, బాలింతలు, పెద్దలు, కిషోర బాలికలు, చిన్నారులు పాల్గొన్నారు.

# అన్నా రాంబాబుకు జన్మదిన శుభాకాంక్షలు



(షణ్ముఖ వెలుగు, పొదిలి, ఆగస్టు 1)
గిద్దలూరు మాజీ ఎమ్మెల్యే, మార్కాపురం నియోజకవర్గ వైసీపీ ఇన్‌ఛార్జి అన్నా వెంకట రాంబాబు జన్మదిన వేడుకలు మార్కాపురం పట్టణంలోని ఆయన నివాసంలో అత్యంత వైభవంగా జరిగాయి. ఈ వేడుకలకు వైసీపీ రాష్ట్ర వాణిజ్య విభాగం జనరల్ సెక్రటరి తాతా సత్యనారాయణ, నాయకులు మంచికంటి సుధీర్, రవ్వా శ్రీను, నారాయణ లు ఆయనను కలిసి శాలువాతో సత్కరించి బొకే అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజానాయకుడు అన్నా రాంబాబు ఆయురారోగ్యాలతో ప్రజా సేవలో మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు.

మొదటి పేజీ తరువాయి

# 'అర్థమైందా రాజా!'..

(షణ్ముఖ వెలుగు, భోగాపురం,ఆగస్టు 01)
ఎర్ర బస్సు కూడా రాని చోటుకు ఎయిర్‌బస్ అవసరమా? అని ఎగతాళి చేసిన చోటే ఇప్పుడు విమానాశ్రయం వచ్చిందని రాష్ట్ర ఐటీ, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్ అన్నారు. గతంలో కొందరు ఉత్తరాంధ్రను తక్కువగా చూసి, ఇక్కడి ప్రజలను అవమానించారని ఆయన విమర్శించారు. "ఎర్ర బస్సు రాదన్నచోట ఎయిర్‌పోర్టు వచ్చింది, మన ప్రధాని మోదీ వచ్చారు. ఇదే మన ఉత్తరాంధ్ర దెబ్బ, అర్థమైందా రాజా!" అంటూ ప్రత్యర్థులను ఉద్దేశించి పదునైన వ్యాఖ్యలు చేశారు.

ఉత్తరాంధ్ర కలలకు ప్రధాని నరేంద్ర మోదీ రెక్కలు తొడిగారని లోకేశ్ కొనియాడారు. ప్రధాని సహకారంతోనే ఆంధ్రప్రదేశ్‌లో అనేక అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయని తెలిపారు. రాష్ట్రాభివృద్ధికి ఆయన పూర్తి మద్దతు ఇస్తున్నారని పేర్కొన్నారు. నమో అంటే.. హిమ్మత్ (ధైర్యం), విశ్వాస్ (నమ్మకం), సురక్షిత్ భారత్ (సురక్షిత భారతం) అని ఆయన వివరించారు.

సహజ వనరులు సమృద్ధిగా ఉన్న ఉత్తరాంధ్ర అభివృద్ధికి ఈ విమానాశ్రయం కీలకం కానుందని లోకేశ్ అభిప్రాయపడ్డారు. ఈ ఎయిర్‌పోర్టు రాష్ట్రానికి ఒక పవర్ ఇంజిన్‌గా మారుతుందని ధీమా వ్యక్తం చేశారు. విమానాశ్రయాన్ని వేగంగా నిర్మించిన జీఎంఆర్ సంస్థను ఈ సందర్భంగా ఆయన ప్రత్యేకంగా అభినందించారు.

## ప్రతిపక్షాల హేళనలకు అభివృద్ధితో సమాధానమిచ్చాం

ప్రతిపక్షాల హేళనలకు తమ అభివృద్ధి పనులతోనే సమాధానమిచ్చామని స్పష్టం చేశారు.ఉత్తరాంధ్ర అభివృద్ధికి భోగాపురం విమానాశ్రయం ఒక బలమైన సింహద్వారంలా నిలుస్తుందని, దీని ద్వారా రాబోయే రోజుల్లో వేలాది మంది స్థానిక యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని చెప్పారు. "ఒకప్పుడు ఈ ప్రాంతాన్ని కేవలం ఎర్రబస్సులు మాత్రమే తిరిగే వెనుకబడిన ప్రాంతం అని కొందరు అవహేళన చేశారు. కానీ ఈ రోజు కళ్లు తెరిచి చూడండి.. ఎర్రబస్సులు తిరిగిన నేలపైనే అధునాతన ఎయిర్‌బస్సులు ల్యాండ్ అయ్యే స్థాయికి ఉత్తరాంధ్ర ఎదిగిందని నిరూపించాం" అని విమర్శకులకు ఘాటుగా కౌంటర్ ఇచ్చారు.దేశంలోనే ఎక్కడా లేని విధంగా అత్యంత వేగంగా ఉత్తరాంధ్రలో ప్రగతి పరుగులు పెడుతోందని వెల్లడించిన రామ్మోహన్‌నాయుడు, ప్రధాని నరేంద్ర మోదీ, సీఎం చంద్రబాబు నాయకత్వంపై ధీమా వ్యక్తం చేశారు. ప్రపంచం గర్వించే నాయకుడు ప్రధాని మోదీ నేతృత్వంలో 'వికసిత్ భారత్', ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో 'విజన్ 2047' లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. ఈ అంతర్జాతీయ విమానాశ్రయం అందుబాటులోకి రావడంతో పారిశ్రామికంగా, పర్యాటకంగా ఉత్తరాంధ్ర ముఖచిత్రం పూర్తిగా మారిపోనుందని కేంద్రమంత్రి స్పష్టం చేశారు.

## ఉత్తరాంధ్రకు భోగాపురం ఎయిర్‌పోర్ట్ కొత్త అధ్యాయం..

మోదీ లాంటి ప్రధాని దేశానికి లభించడం అందరి అదృష్టమని, తనను దూషించిన వారిని కూడా క్షమించే గొప్ప గుణం ఆయనదని పవన్ కళ్యాణ్ చెప్పుకొచ్చారు.

## శభాష్ లోకేశ్.. భుజం తట్టిన ప్రధాని మోదీ

కురిపించారు.గతంలో ఏపీలో ప్రధాని మోదీ పర్యటనలను విజయవంతం చేయడంలో, అలాగే 'యోగాంధ్ర' కార్యక్రమం ద్వారా రికార్డు సాధించడంలో లోకేశ్ చూపిన చొరవను ప్రధాని అప్పట్లోనూ మెచ్చుకున్న విషయం తెలిసిందే. ఇప్పుడు మరోసారి లోకేశ్ పనితీరుపై ప్రధాని బహిరంగంగా ప్రశంసలు కురిపించడం ప్రాధాన్యత సంతరించుకుంది.

## భోగాపురం ఎయిర్ పోర్టు క్రెడిట్ వార్..

స్పష్టంగా తెలుసని పేర్కొంది. అయితే ప్రస్తుతం అధికారంలో ఉన్న ఎన్డీఏ కూటమి నాయకులు ఎలాంటి పాత్ర లేకుండానే మొత్తం క్రెడిట్ వారి ఖాతాలో వేసుకునేందుకు తాపత్రయపడుతున్నారని తీవ్రంగా ఆరోపించింది.జగన్ ప్రభుత్వం ఉన్న సమయంలోనే ఎయిర్‌పోర్టు నిర్మాణం కోసం రూ.1,200 కోట్లు ఖర్చు చేసి భూసేకరణ ప్రక్రియను పూర్తి చేశామని తెలిపింది. నిర్వాసిత కుటుంబాలకు పరిహారం చెల్లించడంలో తమ ప్రభుత్వమే ముందడుగు వేసిందని స్పష్టం చేసింది. ప్రాజెక్టుకు అవసరమైన అన్ని రకాల కీలక పర్యావరణ, విమానయాన అనుమతులను జగన్ హయాంలోనే వేగవంతంగా సాధించామని తెలిపింది. ఎయిర్‌పోర్టు అనుసంధానతకు అవసరమైన రహదారులు, ఇతర మౌలిక సదుపాయాల కల్పనకు నాటి జగన్ ప్రభుత్వమే శ్రీకారం చుట్టిందని, అందువల్ల ఈ ప్రాజెక్టు విజయంలో చంద్రబాబు పాత్ర ఏమీ లేదని విమర్శించింది.

# భోగాపురం ఎయిర్‌పోర్టు ఉత్తరాంధ్రకు మణిహారం..









ఈ సందర్భంగా రాష్ట్రంలోని కీలక ప్రాజెక్టుల పూర్తిపై చంద్రబాబు స్పష్టత ఇచ్చారు. 2027 నాటికి పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసి ప్రధాని చేతుల మీదుగా జాతికి అంకితం చేస్తామని, 2028 నాటికి రాజధాని అమరావతి తొలి దశ పనులను పూర్తి చేసి ప్రారంభిస్తామని ప్రకటించారు. విశాఖ ఉక్కు సెంటిమెంట్‌ను కాపాడింది, రైల్వే జోన్, పోలవరం, అమరావతికి నిధులు ఇచ్చింది ప్రధాని నరేంద్ర మోదీనే అని కొనియాడారు. శంషాబాద్ ఎయిర్‌పోర్టుతో తెలంగాణ దశ మారినట్లే, భోగాపురం ఎయిర్‌పోర్టుతో ఉత్తరాంధ్ర అభివృద్ధి పథంలో దూసుకెళ్తుందని ధీమా వ్యక్తం చేశారు.

రానున్న రెండేళ్లలో ప్రధాని సహకారంతో ఉత్తరాంధ్రలో రూ.6.13 లక్షల కోట్ల పెట్టుబడులతో 189 ప్రాజెక్టులు తీసుకొస్తామని, తద్వారా 5.57 లక్షల మందికి ఉద్యోగాలు కల్పిస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. రూ.2784 కోట్లతో 8 ప్రధాన సాగునీటి ప్రాజెక్టులను మూడేళ్లలో పూర్తి చేస్తామని, 65 ఏళ్లుగా పెండింగులో ఉన్న నేరడి బ్యారేజీకి సైతం అనుమతులు వచ్చాయని తెలిపారు. విశాఖ నుంచి భోగాపురం వరకు బీచ్ కారిడార్ నిర్మించి, టూరిజం, ఫార్మా రంగాలను అభివృద్ధి చేసి ఉత్తరాంధ్ర స్వరూపాన్ని మారుస్తామన్నారు. త్వరలోనే ఇతర ప్రాంతాల నుంచి ఉత్తరాంధ్రకు వలసలు వచ్చే రోజులు వస్తాయని, ప్రభుత్వం కల్పించే అవకాశాలను యువత అందిపుచ్చుకోవాలని పిలుపునిచ్చారు.

### రూ.18వేల కోట్ల విలువైన ప్రాజెక్టులకు శ్రీకారం..

"రూ.18వేల కోట్ల విలువైన ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టాం. ఈ ప్రాజెక్టులు ఏపీని శరవేగంగా, అభివృద్ధి దిశగా తీసుకెళ్తాయి. గిరిజన సంప్రదాయ నృత్యం థింసాను చూసి మధురానుభూతికి లోనయ్యా. అభివృద్ధిలో రికార్డులతో పాటు థింసా నృత్యం కూడా రికార్డు సృష్టించింది. ఒకేసారి 13వేల మంది గిరిజన మహిళల నృత్యం నిజంగా అద్భుతం. చంద్రబాబు విజన్‌కు హృదయపూర్వక అభినందనలు. భోగాపురం ఎయిర్ పోర్టు.. ఉత్తరాంధ్ర అభివృద్ధికి కొత్త రన్‌వేగా, ఆంధ్రా యువత ఉజ్వల భవిష్యత్తుకు కొత్త లాంచ్‌పాడ్‌లా పనిచేస్తుంది. గతంలో ఎక్కడ విమానాశ్రయం నిర్మించినా ఒక్క కుటుంబం పేర్లే ఉండేవి. అయోధ్యలో ఎయిర్‌పోర్టుకు వాల్మీకి పేరు, పంజాబ్‌లో సంత్ రవిదాస్ పేరు పెట్టాం. భోగాపురం ఎయిర్‌పోర్టుకు అల్లూరి సీతారామరాజు పేరు పెట్టాం. 2014కు ముందు మన దేశంలో 74 విమానాశ్రయాలే ఉండేవి. మేం వచ్చాక 12 ఏళ్లలో 166 విమానాశ్రయాలు వచ్చాయి. సామాన్యులకు కూడా విమాన ప్రయాణాన్ని చేరువ చేశాం. విమానం ఎక్కాలన్న పేద, మధ్యతరగతి కలలు సాకారం చేశాం. తమ ప్రాంతం నుంచే విమానం ఎక్కేలా కొత్త అనుభూతి తీసుకొస్తున్నాం. ఉడాన్ ద్వారా దేశ విమానయానరంగంలో పెనుమార్పులు వచ్చాయి.

### డబుల్ ఇంజిన్ సర్కార్.. డబుల్ స్పీడ్‌తో ఏపీ అభివృద్ధి..

దేశంలో బ్లూ ఎకానమీ అభివృద్ధి చేస్తున్నాం. విశాఖపట్నం నుంచి కృష్ణపట్నం వరకు పాత పోర్టులు అభివృద్ధి చేస్తున్నాం. మూలపేట, రామాయపట్నంలో కొత్త పోర్టులు నిర్మిస్తున్నాం. పోర్టుల అభివృద్ధితో పాటు హైవే ఎక్స్‌ప్రెస్‌లు సరికొత్త వేగాన్ని అందిస్తున్నాయి. ఏపీలో రూ.లక్ష కోట్ల విలువైన రైల్వే ప్రాజెక్టుల పనులు జరుగుతున్నాయి. ఈ రాష్ట్ర ప్రజలు ఎప్పుడూ భవిష్యత్తు వైపు చూస్తారు. సాఫ్ట్‌వేర్, ఐటీ సెక్టార్‌లో తెలుగువాళ్లకు మంచి పేరుంది. దేశ, విదేశాల్లో తెలుగువాళ్లు తమ సత్తా చాటుతున్నారు. ప్రతిభావంతులైన యువత సామర్థ్యం దేశానికి ఉపయోగపడాలి. చంద్రబాబు సారథ్యంలో మ్యానుఫ్యాక్చరింగ్ హబ్‌గా ఏపీ మారుతోంది. ప్రపంచంలో అనేక ప్రముఖ కంపెనీల పెట్టుబడులు రాష్ట్రానికి వస్తున్నాయి. ఏపీలో గ్రోత్ ఎకో సిస్టం నిర్మిస్తున్నాం. సెమీకండక్టర్, డేటా సెంటర్ రంగాల్లో వేగంగా పనులు జరుగుతున్నాయి. కేంద్రం.. నక్కపల్లిలో భారీ ఫార్మా కంపెనీ నిర్మిస్తోంది. డబుల్ ఇంజిన్ సర్కార్ వల్లే డబుల్ స్పీడ్‌తో ఏపీ అభివృద్ధి" అని మోదీ తెలిపారు. కార్యక్రమంలో గవర్నర్ జస్టిస్ నజీర్, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, కేంద్రమంత్రులు, రాష్ట్రమంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.




ప్రకాశం


మార్కాపురం


బాపట్ల

షణ్ముఖ
# వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక
02.08.26 ఆదివారం


## వెలుగొండ ప్రాజెక్ట్ పునరావాస కాలనీల్లో మౌలిక వసతుల కల్పన త్వరితగతిన పూర్తి చేయాలి

### జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత

### ముమ్మరంగా అప్రోచ్ రోడ్లు, తాగునీరు, విద్యుద్దీకరణ పనులు చేపట్టాలి

### జాయింట్ కలెక్టర్, అధికారులతో కలిసి వేములకోట, దేవరాజుగట్టు తదితర కాలనీల్లో విస్తృత తనిఖీలు



(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, ఆగస్టు 1)

వెలుగొండ ప్రాజెక్ట్ పునరావాస కాలనీల్లో ముంపు నిర్వాసితులకు అవసరమైన అన్ని రకాల మౌలిక వసతుల కల్పనను ఏమాత్రం నిర్లక్ష్యం చేయకుండా త్వరితగతిన పూర్తి చేయాలని ప్రకాశం జిల్లా కలెక్టర్ ఎం. విజయ సునీత అధికారులను ఆదేశించారు. శనివారం రోజున మార్కాపురం, పెద్దారవీడు మండలాల పరిధిలోని వెలుగొండ ప్రాజెక్ట్ పునరావాస కాలనీలైన దేవరాజుగట్టు, వేములకోట, తోకపల్లి, ఇడుపూర్ 1, 2లలో ఏర్పాటు చేస్తున్న మౌలిక వసతుల పురోగతిని జాయింట్ కలెక్టర్ పులి శ్రీనివాసులు, ఆర్డీవో వెంకట శివరామిరెడ్డి, వెలుగొండ ప్రాజెక్టు అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయిలో విస్తృతంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కాలనీల లేఅవుట్లను, పనుల పురోగతిని క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రాధాన్యత ప్రాతిపదికన పనులు, పునరావాస కాలనీలకు వెళ్లే అప్రోచ్ రోడ్లు, తాగునీటి సరఫరా, విద్యుత్ సౌకర్యాల ఏర్పాట్లను సత్వరమే పూర్తి చేసేందుకు ప్రత్యేక చొరవ చూపాలని స్పష్టం చేశారు. ఇంకా జంగిల్ క్లియరెన్స్ పూర్తికాని కాలనీలలో తక్షణమే పొదలను తొలగించి, భూమిని సమాంతరంగా (లెవెలింగ్) మార్చే పనులను (తరువాయి 4లో...)

# దివ్యాంగులు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలి

## జిల్లా కలెక్టర్ పి రాజాబాబు



(షణ్ముఖ వెలుగు, దర్శి, ఆగస్టు 1)

ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగి లక్ష్యసాధన దిశగా దృష్టి సారించాలని దివ్యాంగులకు జిల్లా కలెక్టర్ పి రాజాబాబు పిలుపునిచ్చారు. అలింకో సంస్థ సహకారంతో దివ్యాంగుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం దర్శి వ్యవసాయ మార్కెట్ యార్డ్ ప్రాంగణంలో నిర్వహించిన ట్రై సైకిళ్లు, వినికిడి పరికరాలు, ఇతర ఉపకరణాల పంపిణీ కార్యక్రమంలో ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి, దర్శి నియోజకవర్గ టిడిపి ఇన్చార్జి గొట్టిపాటి లక్ష్మితో కలిసి ఆయన పాల్గొన్నారు. మొత్తం 309 మంది లబ్ధిదారులకు రూ.79.59 లక్షల విలువైన 443 ఉపకారణాలను ఈ కార్యక్రమంలో వారు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దివ్యాంగులకు అన్ని విధాలుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అండగా ఉంటున్నట్లు చెప్పారు. దివ్యాంగులకు అవసరమైన సహాయ ఉపకరణాల పంపిణీ, సంక్షేమ పథకాల అమలపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు తెలిపారు. 'ఇంద్రధనస్సు' పేరుతో వివిధ సంక్షేమ పథకాలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్నట్లు వివరించారు. తాజాగా కేంద్ర ప్రభుత్వ సహకారంతో బ్యాటరీ ట్రై సైకిళ్లు, మాన్యువల్ ట్రై సైకిళ్లు, వీల్ చైర్లు, వినికిడి పరికరాలు, ఊత కర్రలు ఇస్తున్నట్లు చెప్పారు. అర్హులు ఎవరైనా ఇంకా ఉంటే మరో విడతలో పంపిణీ చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లాలో శాశ్వత ప్రాతిపదికన దివ్యాంగ అభ్యర్థులతో ఉద్యోగాలను త్వరలోనే భర్తీ చేయబోతున్నట్లు చెప్పారు. ఎంపీ మాట్లాడుతూ అలింకో సహకారంతో ఉమ్మడి ప్రకాశం జిల్లాలో రూ.2.25 కోట్ల విలువైన ఉపకారణాలను పంపిణీ చేసేలా చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. ఇందులో దర్శి నియోజకవర్గంలోనే సుమారు రూ.80 లక్షల విలువైన ఉపకరణాలను పంపిణీ చేస్తున్నామని తెలిపారు. దివ్యాంగులలో మనోధైర్యాన్ని పెంచేలా అన్ని విధాల అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఒక్కో బ్యాటరీ ట్రై సైకిల్ విలువ రూ.45 వేల రూపాయలుగా తెలిపారు. ఈ విడతలో 143 బ్యాటరీ ట్రై సైకిళ్లను పంపిణీ చేస్తున్నట్లు వివరించారు. ఈ విధంగా సహకారం అందించిన కేంద్ర సామాజిక న్యాయ, సాధికారత శాఖ మంత్రి వీరేంద్ర కుమార్ కు కృతజ్ఞతలు తెలిపారు. దర్శి ప్రాంతవాసుల రైలు కల కూడా త్వరలోనే నెరవేరుతుందన్నారు. గుంటూరు – కనిగిరి మధ్య ఈ నెలలోనే ' డెము ' రైలు ప్రయాణిస్తుందని కేంద్రమంత్రి చెప్పినట్లు ఎంపీ తెలిపారు. గొట్టిపాటి లక్ష్మి మాట్లాడుతూ దివ్యాంగుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించిందన్నారు. గతంలో రూ.3వేలుగా ఉన్న పెన్షన్ ను రూ.6వేలకు పెంచడంతోపాటు వారి సంక్షేమం కోసం వివిధ పథకాలను ప్రవేశ పెట్టిందంటూ వాటిని ఉదాహరించారు. దివ్యాంగుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు సువార్త మాట్లాడుతూ లబ్ధిదారులను గుర్తించేందుకు గత ఏడాది జనవరి 30వ తేదీన దర్శి నియోజకవర్గంలో ప్రత్యేక క్యాంపును నిర్వహించామన్నారు. అలింకో సంస్థ ద్వారా ఈ ఉపకరణాలను పంపిణీ చేసేలా

4లో





# ఘనంగా అన్నా రాంబాబు జన్మదిన వేడుకలు

### నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలి

### నియోజకవర్గంలో పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాలు

### పుట్టినరోజు వేడుకల్లో ఎమ్మెల్యేలు మాజీ ఎమ్మెల్యేలు



(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, ఆగస్టు 1)

పేదల పెన్నిధి, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి, జగనన్న సైనికుడు, గిద్దలూరు మాజీ ఎమ్మెల్యే, మార్కాపురం నియోజకవర్గ వైసిపి ఇన్చార్జ్ అన్నా రాంబాబు జన్మదిన వేడుకలు మార్కాపురం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. అనంతరం పార్టీ శ్రేణుల మధ్య భారీ కేక్‌ను ఆయన కట్ చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం చేస్తున్న దుశ్చర్యలను ఖండిస్తూ ప్రజాస్వామ్య మనుగడకు తోడ్పడుతున్న గొప్ప నాయకుడు అన్నా రాంబాబు అని తెలిపారు. అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం, సామాజిక న్యాయం కావాలని ప్రజా గొంతుకై పరితపిస్తున్న వ్యక్తి అన్న రాంబాబు అని తెలిపారు . ఎవరికి ఏ ఆపద వచ్చినా అన్నా అంటే నేను ఉన్నానని వారిని ఆదుకునే గొప్ప మనసున్న వ్యక్తి అన్నా రాంబాబు అని తెలిపారు. ప్రజాక్షేత్రంలో ఆయన వేసే ప్రతి అడుగు విజయ తీరాలకు (తరువాయి 4లో...)

# భోగాపురం ఎయిర్ పోర్టు ప్రారంభ వేడుకల్లో మంత్రులు, ఎమ్మెల్యేలు




ఉత్తరాంధ్ర కలలకు రెక్కలు తొడిగిన శుభ సందర్భాన భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవ వేడుకలో పాల్గొని విజయసంకేతం చూపుతున్న మంత్రులు గొట్టిపాటి రవికుమార్, అనగాని సత్యప్రసాద్, పొంగూరు నారాయణ, ఎమ్మెల్యేలు డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి, కందుల నారాయణరెడ్డి, ముత్తుమల అశోక్‌రెడ్డి, ఇంటూరి నాగేశ్వరరావుల చిరుదరహాసం....

# ప్రజలకు అందుబాటులోకి చెత్త ట్రాక్టర్

### బాధ్యతలు స్వీకరించిన రెండు రోజుల్లో సమస్యకు పరిష్కారం చూపిన నూతన కమిషనర్ రామ్మోహన్‌రావు

### షణ్ముఖ వెలుగు కథనం పై స్పందన




(షణ్ముఖ వెలుగు, పొదిలి, ఆగస్టు 1)

పొదిలి నగర పంచాయతీ పరిధిలో గత 15 రోజులుగా ఓ చెత్త ట్రాక్టర్ మూలన పడింది. రిపేరు చేయించేందుకు మున్సిపాల్టీలో కొందరు అధికారులుకు చేతులు రాలేదు. దీంతో పది రోజుల అనంతరం విషయం తెలుసుకున్న షణ్ముఖ వెలుగు ప్రతినిధి "చెత్త మున్సిపాల్టీ పొదిలి" అనే శీర్షిక పేరుతో జులై 27వ తేదీన కథనం ప్రచురితమైంది. ఈ కథనం ప్రచురితమైన మరుసటి రోజున నగర పంచాయతీ నూతన కమిషనర్గా రామ్మోహన్‌రావు బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు స్వీకరించిన తక్షణమే ప్రధానంగా ఉన్న చెత్త ట్రాక్టర్ రిపేరు విషయం సిబ్బంది ఆయన దృష్టికి తీసుకెళ్ళారు. అందరిలాగా రూ.30 వేలు ఎవరు ఇవ్వాలనే ఆలోచన చేయకుండా తక్షణమే నిధులు వెచ్చించి ట్రాక్టర్ రిపేరు చేయించారు. దీంతో విశ్వనాథపురంలోని పలువురు ప్రజలు నూతనంగా బాధ్యతలు స్వీకరించిన కమిషనర్ తక్షణమే ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యకు పరిష్కారం చూపడం ఆనందంగా ఉందన్నారు. అదే విధంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్ళి పరిష్కరించేలా కథనం ప్రచురించిన షణ్ముఖ వెలుగు ప్రతినిధికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.





# దివ్యాంగులు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలి

ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి నిరంతరం పర్యవేక్షించారని కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డిఓ విజయ జ్యోతి, దివ్యాంగుల సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్ గడిపూటి నారాయణ స్వామి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ నాగవేణి, మున్సిపల్ చైర్మన్ పిచ్చయ్య, స్థానిక ప్రముఖులు కడియాల లలిత్ సాగర్, ఇతర అధికారులు, అలింకో ప్రతినిధులు పాల్గొన్నారు. తమకు సహాయ ఉపకరణాలు లభించడంపై దివ్యంగుల సంఘాల నాయకులు ఈ సమావేశంలో హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమానికి వచ్చిన లబ్ధిదారులందరికీ అధికారులు భోజనాలు ఏర్పాటు చేశారు.





## పింఛన్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న దాదా





(షణ్ముఖ వెలుగు, కంభం, ఆగస్టు 1)
కంభం పంచాయతీ పరిధిలో గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి ఆదేశానుసారం 54వ బూత్ పరిధిలోని జుమ్మా మసీద్, చిన్న మసీద్, మార్కెట్, అమ్మవారిశాల పరిసర ప్రాంతాల్లో తెలుగుదేశం పార్టీ ఒంగోలు పార్లమెంట్ ముస్లిం మైనార్టీ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి, మాజీ వార్డు మెంబర్ అత్తర్ షేక్ హుస్సేన్ (దాదా) ఇంటింటికి తిరిగి పింఛన్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు పఠాన్ నాగుర్‌వలి ఖాన్, తెలుగు యువత అధ్యక్షుడు ఫయాజ్, ఖాదర్ భాషా, సచివాలయ సిబ్బంది, ఏఎన్ఎం ఝాన్సీ రాణి, తదితరులు పాల్గొన్నారు.

## ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు



(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, ఆగస్టు 1)
తల్లిపాల వారోత్సవాల సందర్భంగా శనివారం కనిగిరి ప్రాజెక్ట్ అర్బన్ సెక్టార్‌లోని ఎన్‌జీవో కాలనీ అంగన్వాడీ సెంటర్ నందు నిర్వహించిన తల్లిపాల వారోత్సవాలు కార్యక్రమానికి సీడీపీఓ పి సరోజిని హాజరై ముర్రుపాలు బిడ్డకు మొదటి టీకా అని, బిడ్డ పుట్టినప్పటి నుండి ఆరు నెలల వరకు కేవలం తల్లిపాలే ఇవ్వాలని, ఆరు నెలలు నిండిన అనంతరం అనుబంధ పోషకహారం మొదలుపెట్టాలన్నారు. తల్లిపాల వలన బిడ్డ శారీరకంగా, మానసికంగా ఎదుగుతాడని, పుట్టిన మొదటి గంటలోపే ముర్రుపాలు పట్టించాలని తెలియచేసారు. బిడ్డకు తల్లిపాలు ఇవ్వడం వలన బ్రెస్ట్ క్యాన్సర్ లాంటి భయంకరమైన జబ్బులు రాకుండా కాపాడుకోవచ్చని ఆమె తెలియచేసారు. అనంతరం ఆరు నెలల వరకు కేవలం తల్లిపాలు ఇచ్చిన తల్లులకు బహుమతులు అందించి ప్రోత్సహించడమైనది. ఆరు నెలలు నిండిన పిల్లలకు అన్నప్రాసన చేసి అనుబంధ ఆహారం మొదలుపెట్టారు. ఈ కార్యక్రమం నకు సూపర్ వైసర్ సుమతి, అంగన్వాడీ వర్కర్స్ సుజాత, రవికుమారి, మల్లేశ్వరి, అంకమ్మ, విష్ణు ప్రియ, గర్భవతులు, బాలింతలు, తల్లులు హాజరయ్యారు.

## అసాంఘిక కార్యకలాపాల పై ఉక్కుపాదం

**ఎన్‌ఫోర్స్‌మెంట్ ముమ్మరం చేసిన ప్రకాశం జిల్లా పోలీసులు**
**పేకాట ఆడుతున్న స్థావరం పై ఒంగోలు టాస్క్ ఫోర్స్ పోలీసులు దాడి**
**నలుగురిని అదుపులోకి తీసుకొని రూ.11,500 నగదు, 4 సెల్ ఫోన్లు, మూడు మోటార్ సైకిళ్ళు స్వాధీనం**



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఆగస్టు 1)
ప్రకాశం జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా పలు పోలీస్ స్టేషన్ల పరిధిలో అసాంఘిక కార్యకలాపాల పై ఒంగోలు టాస్క్ ఫోర్స్ పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. ప్రకాశం జిల్లా చీమకుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఇలపావులూరు పంచాయతీ గ్రామం శివారులో శనివారం సాయంత్రం సమయంలో పేకాట స్థావరంపై టాస్క్ ఫోర్స్ ఇంచార్జ్ సీఐ కమలాకర్ ఆధ్వర్యంలో ఏ ఎస్ఐ షేక్ మహబూబ్ బాషా వారి సిబ్బంది ఆకస్మికంగా దాడులు నిర్వహించారు. ఈ దాడిలో 4 మంది వ్యక్తులను అదుపులోకి తీసుకొని, వారి వద్ద నుండి రూ.11500 నగదు, 4 మొబైల్ ఫోన్లును స్వాధీనం చేసుకున్నారు. వారి పై సంబంధిత చట్టాల ప్రకారం కేసు నమోదు నిమిత్తం చీమకుర్తి పోలీస్ స్టేషన్లో టాస్క్‌ఫోర్స్ పోలీసులు అప్పగించారు. ఈ సందర్భంగా పోలీసులు ప్రజలకు విజ్ఞప్తి చేస్తూ, పేకాట వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలకు దూరంగా ఉండాలని, జూద క్రీడలు మరియు ఇతర అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడేవారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. అలాగే, జిల్లాలో ఎక్కడైనా ఇలాంటి కార్యక్రమాలకు సంబంధించి సమాచారం ఉంటే, వెంటనే డయల్ 112 నంబర్‌కు లేదా పోలీసు వాట్సాప్ నంబర్ 9121102266కు మెసేజ్ ద్వారా తెలియజేయాలని ప్రజలను కోరారు

# ఘనంగా అన్నా రాంబాబు జన్మదిన వేడుకలు



చేరుకోవాలని అభిలాసించారు. అల్లా కృపతో అన్నా రాంబాబు నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలి అని ఆకాంక్షించారు. ఎన్నికలు ఎప్పుడు జరిగిన అన్నా రాంబాబు అత్యధిక మెజారిటీతో గెలిచి నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తారని అభిలషించారు. అనంతరం పుట్టినరోజు వేడుకలు సందర్భంగా పార్టీ నాయకులు కార్యకర్తలు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి ఆదిములపు సురేష్, పట్టణ అధ్యక్షుడు సలీం, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ గోలమారి శ్రీనివాసరెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ చిర్లంచర్ల బాలమురలీకృష్ణ, పట్టణ మహిళా అధ్యక్షురాలు గుంటక వనజాక్షి చెన్నారెడ్డి, వైసిపి నాయకులు, కార్యకర్తలు నియోజకవర్గం నుంచి భారీ స్థాయిలో పాల్గొన్నారు.

## వెలుగొండ ప్రాజెక్ట్ పునరావాస కాలనీల్లో మౌలిక వసతుల కల్పన త్వరితగతిన పూర్తి చేయాలి

వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. నిర్వాసితులకు కల్పిస్తున్న మౌలిక వసతులలో ఎలాంటి లోపాలు ఉండకూడదని, పనుల నాణ్యతలో రాజీ పడకుండా నిర్దేశిత సమయానికి అందుబాటులోకి తీసుకురావాలని స్పష్టం చేశారు. ఈ తనిఖీలో వెలుగొండ ప్రాజెక్టు ఇంజనీరింగ్ అధికారులు, స్థానిక రెవెన్యూ సిబ్బంది, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# అన్నా రాంబాబుకు జన్మదిన శుభాకాంక్షలు



(షణ్ముఖ వెలుగు, మార్కాపురం టౌన్, ఆగస్టు 1)
రెడ్డి జేఏసీ డాక్టర్స్ విభాగం సహాయ కార్యదర్శి, ప్రముఖ ఆర్ఎంపి వైద్యులు డాక్టర్ ఎర్రం వెంకటరెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా అన్నా వెంకట రాంబాబు జన్మదిన వేడుకలు నిర్వహించారు. గిద్దలూరు మాజీ ఎమ్మెల్యే, మార్కాపురం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి అన్నా వెంకట రాంబాబు జన్మదినం సందర్భంగా మార్కాపురంలోని ఆయన నివాసంలో అన్నా రాంబాబును కలిసి పూలమాలలు వేసి శాలువాలు కప్పి బొకేలు అందించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం డాక్టర్ ఎర్రం వెంకటరెడ్డి ఆధ్వర్యంలో మార్కాపురంకు వచ్చిన బుచ్చనపాలెం, కొత్తపాలెం గ్రామాల వైకాపా నాయకులు, కార్యకర్తల సమక్షంలో అన్న జన్మదిన కేక్‌ను కట్ చేసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.

## 21వ డివిజన్‌లో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ





(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఆగస్టు 1)
ఒంగోలు నియోజకవర్గ శాసనసభ్యులు దామచర్ల జనార్దన్‌రావు ఆదేశాల మేరకు 21వ డివిజన్‌లో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా అర్హులైన లబ్ధిదారులకు వారి నివాసాల వద్దకే వెళ్లి పెన్షన్లను పంపిణీ చేసి, ప్రభుత్వం పేదల సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తోందని నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో 21వ డివిజన్ కన్వీనర్ కోటపాటి కాశీరావు, అధ్యక్షులు గొల్లపూడి బాబురావు, జిల్లా ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యురాలు పొన్నరసు సునీత, బూత్ ఇన్‌చార్జిలు మురళి, నాయబ్ రసూల్, నరసింహారావు, చిన్ని, హనుమంతు, స్వర్ణతో పాటు వార్డు సిబ్బంది పాల్గొన్నారు.

## బాటసారిని ఢీకొన్న బైక్ స్పాట్‌లో మృతి





(షణ్ముఖ వెలుగు, కొండపి, ఆగస్టు 1)
ఒంగోలు తాలూకా పోలీస్ స్టేషన్ పరిధిలో పెళ్లూరు ఫ్లైఓవర్ వద్ద నడుస్తూ వెళ్తున్న వ్యక్తిని టూ వీలర్ గుద్దడంతో నడుచుకుంటూ వెళ్లే వ్యక్తి రోడ్డు పై పడిపోవడం జరిగింది. రోడ్డు పై పడిపోయిన వ్యక్తిని లారీ ఢీకొట్టడంతో స్పాట్ లోనే చనిపోయినట్టు సమాచారం.
పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## 14న ఆదిత్య డిగ్రీ కళాశాలలో దేశభక్తి పాటల పోటీలు

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఆగస్టు 1)

ఒంగోలులోని బాలాజీరావుపేటలో పోలేరమ్మ గుడి ప్రక్కన ఉన్న ఆదిత్య డిగ్రీ కాలేజీలో "జాతీయ సేవా పథకం" (యన్.యస్.ఎస్) కార్యక్రమాలలో భాగంగా ఆగష్టు 14న శుక్రవారం ఉదయం పది గంటలకు పాఠశాల స్థాయి, కాలేజీ స్థాయి విద్యార్థులకు దేశభక్తి పాటల పోటీలను వేర్వేరుగా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ కె సురేష్, యన్‌యస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ పి శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనే విద్యార్థినీ, విద్యార్థులు ముందుగా తమ పేర్లను నమోదు చేసుకోవాలని వారు తెలిపారు. పోటీల్లో పాల్గొని గెలుపొందిన విజేతలకు బహుమతులను ఆగష్టు 15న స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా కాలేజీలో జరిగే సభలో అందజేస్తామని తెలిపారు. కావున పోటీల్లో పాల్గొనే వారు వివరాలకు 9701296662, 9701256662 నెంబర్లను సంప్రదించాలని వారు కోరారు.

## ముళ్ల చెట్లు తొలగింపు





(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, ఆగస్టు 1)

కనిగిరి మున్సిపాలిటీ పరిధిలో మాచవరంలో పరిసరాల పరిశుభ్రతలో భాగంగా రోడ్డుకి ఇరువైపులా ముళ్ల చెట్లను తొలగించడం సైడ్ కాలువలో ఉన్న పూడికను తొలగించడం లార్వాను ఐడెంట్ చేయడం ఫీవర్స్ సర్వే చేయించడం జరిగింది. ఈ కార్యక్రమంలో హెల్త్ ఎడుకేటర్ ఆఫీసర్ ఎం భాస్కర్, హెల్త్ అసిస్టెంట్ జి రామకృష్ణ, పంచాయతీ సిబ్బంది, మునిసిపల్ సిబ్బంది, అలాగే తెలుగుదేశం పార్టీ నాయకులు అచ్చాల రవి, గ్రామస్థులు పాల్గొన్నారు.

## 5న మండల సర్వసభ్య సమావేశం

(షణ్ముఖ వెలుగు, తర్లుపాడు, ఆగస్టు 1)

ఈ నెల 5వ తేదీ ఉదయం 11 గంటలకు మండల సర్వసభ్య సమావేశం స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయ ఆవరణలో ఎంపీపీ సూరెడ్డి భూలక్ష్మి అధ్యక్షతన నిర్వహించబడుతుందన్నారు. ఈ సమావేశానికి మండలస్థాయి అధికారులు, ఎంపీటీసీ, జడ్పిటిసి, కోఆప్షన్ సభ్యులందరూ హాజరు కావాలని ఎంపీడీవో జయరాం నాయక్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు.

## ఆర్ఎంపి సుబ్బారావు సేవలు అభినందనీయం




(షణ్ముఖ వెలుగు, చిన్నగంజాం, ఆగస్టు 1)

చినగంజాం మండలంలో ఎంతోమంది పేద ప్రజలకు వైద్య సేవలు అందిస్తూ వారి మన్ననలను పొందుతున్న గ్రామీణ వైద్యుడు సుబ్బారావు ఎంతో అభినందనీయుడని చిన్నగంజాం పాస్టర్స్ యూనియన్ అధ్యక్షులు పాలపర్తి జోసెఫ్ అన్నారు. గ్రామీణ వైద్యుడు సుబ్బారావు 65వ జన్మదినం సందర్భంగా చిన్నగంజాం మండలం పాస్టర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఆయన జన్మదిన వేడుకలను చినగంజం, సోపిరాల రంగా సెంటర్లోని విజయ క్లినిక్ నందు శనివారం ఘనంగా నిర్వహించారు. చిన్నగంజాం మండల పాస్టర్స్ యూనియన్‌కు తమ సహాయ సహకారాలు అందించటం ఎంతో ఆనందదాయకమని అన్నారు. ఈ సందర్భంగా ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం గ్రామీణ వైద్యుడు సుబ్బారావును పూలమాలతో, శాలువాతో జ్ఞాపికను, మొక్కను అందజేసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో చినగంజాం మండల పాస్టర్స్ యూనియన్ సభ్యులు, విజయ ప్రథమ చికిత్స కేంద్రం సిబ్బంది, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# కిమ్స్ హాస్పిటల్‌లో అరుదైన వ్యాధికి రేడియేషన్ చికిత్స

### ఒంగోలు కిమ్స్ క్యాన్సర్ విభాగంలో రేడియేషన్ ఆంకాలజీ ఆధ్వర్యంలో రెండు క్లిష్టమైన క్యాన్సర్ కేసుల్లో వైద్యులు విజయం



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఆగస్టు 1)

మొదటి కేసులో 24 సంవత్సరాల అబ్బాయి 5 నెలల నుండి తలనొప్పి, ఎడమ చెవిలో గుయ్ అని శబ్దంతో ఆసుపత్రికి వచ్చారు. నిర్ధారణ పరీక్షల్లో భాగంగా ఎంఆర్ఐ స్కాన్ చేయగా ఎడమ చెవి లోపల భాగం, చిన్న మెదడు మధ్యలో కణితి గుర్తించారు. ముక్క పరీక్ష ద్వారా అది స్కివాన్నోమా అని తెలిసింది. అనంతరం వైద్యులు సమగ్రంగా పరిశీలించి, అత్యాధునిక సాంకేతికతతో (స్టీరియోటాక్టిక్ రేడియేషన్ థెరపీ) ద్వారా చికిత్స అందించారు. అయిదు రోజులలో విజయవంతంగా చికిత్స చేశారు. రేడియేషన్ చికిత్స క్యాన్సర్ కణితిలను మాత్రమే కాకుండా ఇలాంటి అరుదైన క్యాన్సర్ కానీ కణితిలకు కూడా చేయవచ్చును. ఈ చికిత్సతో రోగి ఆరోగ్యం మెరుగుపడి ప్రస్తుతం కోలుకుంటున్నారు. రెండవ కేసులో 54 సంవత్సరాల పురుషుడు ఊపిరితిత్తుల క్యాన్సర్‌తో రెండు సంవత్సరాల నుంచి కిమోథెరపీ చికిత్స తీసుకొనుచున్నాడు. దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలతో ఆసుపత్రికి వచ్చారు. పిఈటి-సిటి స్కాన్ ద్వారా ఒక్క మెదడులో మాత్రమే రెండు చిన్న, చిన్న కణితిలు ఉన్నాయి. మీగత శరీర భాగం లో కణితిలు కిమోథెరపీ ద్వారా నయమయ్యాయి. మెదడులో ఉండే ఆ రెండు కణితిలకి (ఒక్కోటి 2.5సెం.మీ) ఒకటి చిన్న మెదడు పక్కన ఎడమ వైపు ( మరొకటి ఎడమవైపు వెనుక భాగం లో) వైద్య బృందం సమన్వయంతో చికిత్స ప్రణాళిక రూపొందించి, (స్టిరియోటాటిక్ రేడియో సర్జరీ) అనే అత్యాధునిక రేడియేషన్ పద్ధతిలో ఒక్క సెషన్ లోనే చికిత్స చేయబడుతుంది. ఈ రెండు కేసులను డాక్టర్ హరికాంత్ నాయకత్వంలో నిపుణుల బృందం సమన్వయంతో విజయవంతంగా నిర్వహించారు. కిమ్స్ ఒంగోలులో అందుబాటులో ఉన్న ఆధునిక సాంకేతిక సదుపాయాలు మరియు అనుభవజ్ఞులైన వైద్యుల వల్ల క్లిష్టమైన క్యాన్సర్ కేసులను కూడా సమర్థవంతంగా చికిత్స చేయగలుగుతున్నామని ఆసుపత్రి వర్గాలు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ టి శ్రీహరిరెడ్డి, మెడికల్ డైరెక్టర్ మాట్లాడుతూ ఆధునిక సాంకేతికత, నిపుణుల సమన్వయంతో క్లిష్టమైన క్యాన్సర్ కేసులను కూడా విజయవంతంగా చికిత్స చేయగలుగుతున్నాము. రోగులు ప్రారంభదశలోనే పరీక్షలు చేయించుకోవడం ఎంతో ముఖ్యమని



తెలిపారు. అలాగే కె అంకిరెడ్డి, చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్, డాక్టర్ వి ప్రవీణ్ కుమార్, రీజినల్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ మాట్లాడుతూ కిమ్స్‌లో అత్యాధునిక వైద్య సదుపాయాలు అందుబాటులో ఉన్నాయి. రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించడం మా ప్రధాన లక్ష్యం అని పేర్కొన్నారు. ప్రజలు ఆరోగ్యం పై నిర్లక్ష్యం చేయకుండా, లక్షణాలు కనిపించిన వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు.

# చంటి బిడ్డలకు తల్లిపాలే దివ్య ఔషధం

## డాక్టర్ దాసరి చంద్రశేఖర్



(షణ్ముఖ వెలుగు, పర్చూరు, ఆగస్టు 1)

మండలంలోని ఉప్పుటూరులోని ఐసిడిఎస్ కార్యాలయం నందు శనివారం సిడిపిఓ సుభద్ర ఆధ్వర్యంలో జరిగిన తల్లిపాల వారోత్సవాల కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఉప్పుటూరు ప్రభుత్వ హోమియో వైద్యులు, జిల్లా ఆయుష్ ఆటిజం సెల్ నోడల్ అధికారి డాక్టర్ దాసరి చంద్రశేఖర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ దాసరి చంద్రశేఖర్ మాట్లాడుతూ ఈ ప్రపంచంలో బిడ్డ పుట్టిన వెంటనే ఆహార రూపంలో తల్లి అందించే మొట్టమొదటి దివ్య ఔషధం తల్లిపాలే అని, తల్లిపాలలో అనేక రకాల పోషక పదార్థాలు ఉండడమే కాకుండా, ముఖ్యంగా యాంటిబాడీస్ బిడ్డకు తల్లిపాల ద్వారానే అందుతాయని, దీని ద్వారా పిల్లలలో వ్యాధి నిరోధక శక్తి పెరిగి భవిష్యత్తులో వచ్చే అనేక రకాల భయంకర వ్యాధులను నియంత్రించ వచ్చునని, వ్యాధి వచ్చిన తర్వాత చికిత్స పొందే దానికన్నా వ్యాధి రాకుండా ముందు జాగ్రత్తే మిన్న అని అన్నారు. ఈ రోజుల్లో ప్రబలుతున్న ఎలర్జీలు, పలు రకాల ఆటో ఇమ్యూన్ వ్యాధులకు చెక్ పెట్టడం కేవలం తల్లిపాల ద్వారానే సాధ్యమవుతుందని, తల్లిపాల ద్వారా అటు బిడ్డకు సంపూర్ణ పోషణ, ఆరోగ్యం లభించడమే కాకుండా ఇటు బిడ్డకు పాలు ఇవ్వడం ద్వారా తల్లి కూడా భవిష్యత్తులో తలెత్తే రొమ్ము మరియు అండాశయ క్యాన్సర్లు, షుగర్ వంటి వ్యాధుల నుంచి విముక్తి లభిస్తుందనీ, కావున అంగన్వాడీ కార్యకర్తలు అందరూ తమ దగ్గరకు వచ్చే పిల్లల తల్లులకు తల్లిపాలే పుత్తడి పాలని వారికి అర్థమయ్యేలా వివరించి, కనీసం ఆరు నెలల పాటు బిడ్డకు తల్లిపాలు అందేలా చూడాలని, ఆ విధంగా ప్రతి తల్లి, బిడ్డ యొక్క ఆరోగ్యాన్ని పెంపొందించడంలో తమ వంతు పాత్రను పోషించాలన్నారు. అంతే కాకుండా త్వరలో బాపట్లలో ప్రారంభమయ్యే జిల్లా ఆయుష్ ఆటిజం సెల్ వైద్య సేవలను ప్రజలకు చేరువ చేసి, ఆటిజం పిల్లలకు, వారి కుటుంబాలకు సహాయకరంగా ఉండాలన్న జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ ఉద్దేశ్యాన్ని నెరవేర్చడంలో తమ వంతు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి సూపర్వైజర్లు, పర్చూరు మండల అంగన్వాడీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# ఆరోగ్యకరమైన ఊపిరితిత్తులతోనే ఆనందకరమైన జీవితం సాధ్యం

(షణ్ముఖ వెలుగు, పర్చూరు, ఆగస్టు 1)



ప్రపంచ ఊపిరితిత్తుల క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా శనివారం ఉదయం ఉప్పుటూరులోని జడ్పీ హైస్కూల్ , ప్రభుత్వ హోమియో వైద్యశాల నందు ధూమ్పానం చేయడం వల్ల వచ్చే ఆరోగ్య సమస్యల గురించి ప్రభుత్వ హోమియో వైద్యులు డాక్టర్ దాసరి చంద్రశేఖర్ అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఉప్పుటూరు ప్రభుత్వ హోమియో వైద్యులు, జిల్లా ఆయుష్ ఆటిజం సెల్ నోడల్ అధికారి డాక్టర్ దాసరి చంద్రశేఖర్ మాట్లాడుతూ మానవుడు భూమిపై పుట్టినప్పటి నుంచి గిట్టే వరకు ఊపిరితిత్తులు నిరంతరం పనిచేస్తూ మనం బతకడానికి అవసరమైన ప్రాణవాయువు (ఆక్సిజన్) అందిస్తాయని, వాటిలో ఉండే చిన్న చిన్న ఆల్వియూలై అనే గాలి గదుల ద్వారా మానవ రక్తంలోకి ప్రాణవాయువు అందించబడి, కార్బన్ డయాక్సైడ్ వంటి చెడువాయువులు బయటకు వెళ్తాయని, ఇలాంటి అద్భుతమైన శ్వాస కోస అవయవాలు నిరంతరం ధూమపానం చేయడం వల్ల అనేక రకాల వ్యాధులకు గురవుతాయని, ధూమ్పానం చేయడానికి వాడే చుట్ట లేదా బీడీ లేదా సిగరెట్లో (పొగాకు) 7 వేలకు పైగా హానికర కెమికల్స్ ఉంటాయని, వీటిలో ముఖ్యంగా నికోటిన్, కార్బన్ మోనాక్సైడ్, కార్సినోజెనిక్ ఏజెంట్లు ప్రాణాంతకమైనవని, నికోటిన్ వల్ల రక్తనాళాల్లో కొవ్వు పేరుకుపోవడం వల్ల రక్తనాళాలు సన్నబడి హార్ట్ ఎటాక్ వంటి గుండె జబ్బులు తలెత్తుతాయని, అలాగే ఊపిరితిత్తులలోని గాలి గొట్టాలను, ఆల్వియూలై నిర్మాణాలను పాడు చేయడం వల్ల ఊపిరితిత్తులకు బ్రాంకిల్ ఆస్తమా, ఎంఫైసీమా, సిఓపిడి, ప్రాణాంతకరమైన లంగ్ క్యాన్సర్ వచ్చే అవకాశం ఉందని, ఊపిరితిత్తుల క్యాన్సర్ వచ్చిన వెంటనే ప్రారంభ దశలో గుర్తిస్తే, వచ్చిన ఊపిరితిత్తులోని భాగాన్ని తీసివేయడం ద్వారా ప్రాణాలు నిలుపుకోవచ్చుని, కానీ ప్రారంభ దశలో గుర్తించ లేకపోతే మాత్రం క్యాన్సర్ వ్యాధిలో ప్రాణాలు నిలపడం వైద్యుడు చేతిలో ఉండదని, కావున వ్యాధి వచ్చిన తర్వాత బాధపడే కన్నా రాకుండా ముందు నుంచే మంచి అలవాట్లను అలవర్చుకోవాలని, ధూమపానమునకు దూరంగా ఉండాలని, అంతేకాకుండా పరోక్షంగా పొగ తాగడం (పాసివ్ స్మోకింగ్) అంటే సిగిరెట్ త్రాగేవారు వదిలే పొగను పీల్చడం చాలా ప్రమాదకరమని, నేటి విద్యార్థులే రేపటి భవిష్యత్ తరాలకు పునాదులు గనుక, మీ చుట్టూ ఉన్న వారు కూడా ధూమపానం చేయకుండా నియంత్రించడంలో మీ తల్లిదండ్రులకు, బంధుమిత్రులకు ధూమపానం వల్ల వచ్చే దుష్ప్రభావాలను వివరించి వారు ధూమపానాన్ని మానివేయడంలో మీ వంతు కృషిచేయాలని, అప్పుడు మాత్రమే మనం ఒక నవీనమైన ఆరోగ్యకర సమాజాన్ని నిర్మించగలమని, మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉందని, దానికోసం అందరూ కలిసికట్టుగా కృషి చేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉప్పుటూరు ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులు, అధ్యాపక బృందం, విద్యార్థిని విద్యార్థులకు మరియు వైద్యశాలకు వచ్చిన రోగులు, తదితరులు పాల్గొన్నారు.

# నేరాల నియంత్రణకు, ప్రయాణికుల భద్రతకు నిరంతరం అప్రమత్తం

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఆగస్టు 1)

రైల్వే పోలీస్ ఐజీ ఎన్ రాజకుమారి మార్గదర్శకాలు, డీఎస్ఆర్పి మురలీధర్ ఆదేశాలు, ఐఆర్పి మౌలా షరీఫ్ సారథ్యంలో రైల్వే ఎస్ఐ టి శ్రీరామ్ ఆధ్వర్యంలో ఒంగోలు ప్రభుత్వ రైల్వే పోలీసులు రైళ్లలో, రైల్వే స్టేషన్లలో కట్టుదిట్టమైన తనిఖీలు నిర్వహిస్తూ, నేరాల నియంత్రణకు, ప్రయాణికుల భద్రతకు నిరంతరం అప్రమత్తంగా విధులు నిర్వహిస్తున్నారు. 31వ తేదీన ఐఆర్పి ఒంగోలు నుండి అందిన విశ్వసనీయ సమాచారంతో రైలు నెం.17480 తిరుపతి-పూరి ఎక్స్‌ప్రెస్‌లో తనిఖీలు నిర్వహించి, తిరుమల పోలీస్ స్టేషన్ క్రైమ్ నెం.28/2026 కేసులో నిందితుడైన జువెనైల్ టెల్లా మనోజ్ భాను కుమార్ (17 సంవత్సరాలు)ను అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుండి సుమారు 60 గ్రాముల బరువున్న రూ.7,50,000 విలువైన రెండు బంగారు గొలుసులను పూర్తిగా స్వాధీనం చేసుకొని నిందితుడిని స్వాధీనం చేసిన ఆస్తిని తదుపరి చట్టపరమైన చర్యల నిమిత్తం తిరుమల పోలీసులకు అప్పగించారు. అదే విధంగా 22వ తేదీన రైలు నెం.12864 హౌరా ఎక్స్‌ప్రెస్‌లో పొట్నూరు జశ్వంత్ కుమార్‌ను ఒంగోలు రైల్వే స్టేషన్ నుండి రైలు బయలుదేరిన వెంటనే అదుపులోకి తీసుకొని, అతని వద్ద నుండి ఆంజనేయస్వామి విగ్రహాన్ని స్వాధీనం చేసుకొని, నిందితుడితో



పాటు తిరుమల పోలీసులకు అప్పగించారు. అలాగే 20వ తేదీన డీఐజీ సత్య ఏసుబాబు ఉత్తర్వుల మేరకు, ఐఆర్పి ఒంగోలు పర్యవేక్షణలో గూడూరు ఆర్‌పీఎస్ఐ ఎం నారాయణ తన సిబ్బందితో కలిసి విధులు నిర్వహిస్తున్న సమయంలో, సత్యసాయి జిల్లా, కదిరి టౌన్ పోలీస్ స్టేషన్ క్రైమ్ నెం.175/2026, 262 బిఎన్ఎస్ కేసులో రిమాండ్‌లో ఉన్న ముద్దాయి మేకల నరసింహ పోలీసుల చట్టబద్ధమైన కస్టడీ నుండి తప్పించుకొని పరారైనట్లు సమాచారం అందింది. సమాచారం అందుకున్న వెంటనే గూడూరు రైల్వే స్టేషన్, పరిసర ప్రాంతాల్లో విస్తృత గాలింపు చర్యలు చేపట్టగా, ముద్దాయి తన భార్యతో కలిసి గూడూరు రైల్వే స్టేషన్ సమీపంలో ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం అందడంతో తనిఖీలు నిర్వహించి, ముద్దాయిని, అతని భార్యను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వారిని కదిరి టౌన్ సీఐ, ఎస్ఐ ధనుంజయ, వారి సిబ్బందికి తదుపరి చట్టపరమైన చర్యల నిమిత్తం అప్పగించారు. ఈ మూడు సంఘటనలు రైల్వే పోలీసుల అప్రమత్తత, సమయస్ఫూర్తి, సమన్వయం, సమర్థవంతమైన విధి నిర్వహణకు నిదర్శనంగా నిలిచాయి. నేరస్థులను గుర్తించి చట్టం ముందు నిలబెట్టడంలో రైల్వే పోలీసులు నిరంతరం కృషి చేస్తున్నారు. రైల్వే స్టేషన్లు, రైళ్లు సీసీ కెమెరాల నిఘా మరియు రైల్వే పోలీసుల నిరంతర పర్యవేక్షణలో ఉన్నాయి. దొంగతనం, దేవాలయ ఆస్తుల చోరీ, చట్టవిరుద్ధ కార్యకలాపాలు లేదా ఇతర నేరాలకు పాల్పడిన వారిని తప్పకుండా గుర్తించి అరెస్టు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. తప్పుడు పనులు చేస్తే జైలుకే అనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలి. ప్రయాణికుల భద్రతే మా ప్రధాన లక్ష్యమని ఎస్ఐ తెలిపారు.

## నవోదయ 6 వ తరగతి ప్రవేశ పరీక్షకు గడువు ఆగస్టు 7 వరకు పొడిగింపు

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఆగస్టు 1)

జవహర్ నవోదయ పాఠశాలలో 6వ తరగతికి అడ్మిషన్లకు నిర్వహించే ప్రవేశ పరీక్ష దరఖాస్తుకు గడువు పొడిగించారని ప్రిన్సిపల్ సి.శివరాం శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రకాశం జిల్లా పరిధిలో 5 వతరగతి చదువుతున్న విద్యార్థులు జవహర్ నవోదయ పాఠశాలలో అడ్మిషన్లు పొందవచ్చన్నారు. ఈ అడ్మిషన్లకు నిర్వహించే ప్రవేశ పరీక్షకు ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. 2027-28వ సంవత్సరానికి 6వ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకునేందుకు ఆగస్టు 7వ తేదీ వరకు గడువు పొడిగించారన్నారు.

# ఎస్సీ, ఎస్టీ కేసుల్లో ముద్దాయిలను అరెస్టు చేయాలి

### డిఎస్పిని డిమాండ్ చేసిన దళిత నేత నీలం

(షణ్ముఖ వెలుగు, దర్శి, ఆగస్టు 1)



ఎస్సీ, ఎస్టీ కేసుల్లో ముద్దాయిలను అరెస్టు చేయాలని దర్శి డిఎస్పీ బాల మురలీకృష్ణను దళిత హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షులు నీలం నాగేంద్రరావు డిమాండ్ చేశారు. శనివారం దర్శి డీఎస్పీ కార్యాలయంలో డీఎస్పీని కలిసి పెండింగ్ ఎస్సీ ఎస్టీ కేసులు అరెస్టులు కోర్టులో ఛార్జ్ షీట్ ఫైలింగ్ పై చర్చించారు. తాళ్లూరు పోలీస్ స్టేషన్ పరిధిలో విట్లాపురం గ్రామంలో ఎస్టి యానాది కులానికి చెందిన చేవూరి మౌనిక నాలుగున్నర సెంట్లు స్థలాన్ని ఆక్రమించి దాడి చేసి రజాకారుల లా వ్యవహరిస్తున్న ముద్దాయిలను వెంటనే అరెస్టు చేసి కోర్టులో ఛార్జ్ సీట్ ఫైల్ చేయాలన్నారు. అలాగే శివరాంపురం గ్రామంలో మాదిగ కులానికి చెందిన అనపర్తి షడ్రక్ పట్టా స్థలం 26 సెంట్లు సరిహద్దులు మార్చి, తప్పుడు డాక్యుమెంట్లతో రిజిస్టర్ చేయించుకొని అక్రమ కట్టడాలు పాలకేంద్రం, వే బ్రిడ్జ్ కట్టిన బొగ్గుల శ్రీనివాస్‌రెడ్డి ముఠాను అరెస్టు చేయాలన్నారు. ఆర్డీవో రిపోర్టు తెప్పించుకొని మాదిగల పట్టా భూమి అక్రమ రిజిస్ట్రేషన్‌కు సహకరించిన పంచాయతీ సెక్రటరీ దర్శి సబ్‌రిజిస్టర్ ఎలక్ట్రిసిటీ తదితరుల పై కూడా ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయించి అరెస్టు చేయాలన్నారు. బొగ్గుల శ్రీనివాసరెడ్డి ముఠా నిర్మించిన వే బ్రిడ్జి పాలకేంద్రాన్ని కూల్చివేసి హక్కుదారులైన అనుపర్తి షెడ్రక్‌కు స్వాధీనం చేయాలన్నారు. అద్దంకి మండలం తిమ్మాయిపాలెం గ్రామంలో పాలేటి మరియమ్మ అను దళిత మహిళ కూతురును కిడ్నాప్ చేసి లైంగిక దాడికి పాల్పడిన ఘటనలో మెడికల్ రిపోర్ట్ తెప్పించి అగ్రకుల ముద్దాయిలను కూడా అరెస్టు చేయాలన్నారు. అదే తిమ్మాయిపాలెం వద్ద తెలుగుదేశం పార్టీకి చెందిన ప్రభుత్వ సిట్టింగ్ అనుమతి లేని కుబేర వైన్స్‌లో జూన్ 28వ తేదీన జరిగిన కురుగంటి రవితేజ అను దళిత యువకుని పై కుబేర వైన్స్ నిర్వాహకులు అశోక్, తదితరులు దాడి చేసిన ఘటన పై విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తన అనుచరులను రక్షించడానికి కేసును మాఫీ చేయడానికి ప్రయత్నిస్తున్నాడన్నారు. ప్రభుత్వ అనుమతి లేకుండా కుబేర వైన్సను బార్‌లా నిర్వహిస్తున్నందువలన కుబేర వైన్స్ లైసెన్సును ఎక్సైజ్ సూపర్డెంట్‌కు నివేదిక పంపించి రద్దు చేయించాలని దర్శి డిఎస్పిని బాల మురళీకృష్ణను నీలం నాగేంద్ర డిమాండ్ చేశారు. డీఎస్పీని కలిసిన వారిలో మాల మహానాడు జిల్లా అధ్యక్షులు దారా అంజయ్య, కార్యదర్శి కాకుమాను రవి, మాదిగ పరిరక్షణ సమితి నాయకులు పత్రా బంగారం, తదితరులున్నారు.

# అంగన్వాడీ కార్యకర్తల భర్తీకి నిబంధనలకు విరుద్ధంగా ఇచ్చిన నోటిఫికేషన్ రద్దుచేయాలి

### అర్హులైన అంగన్వాడీ హెల్పర్లకు ప్రమోషన్స్ ఇవ్వాలి

### సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి యం రమేష్ డిమాండ్

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఆగస్టు 1)



అంగన్వాడీ కార్యకర్తల భర్తీకి నిబంధనలకు విరుద్దంగా ఇచ్చిన నోటిఫికేషన్ రద్దుచేసి అర్హులైన అంగన్వాడీ హెల్పర్లకు ప్రమోషన్స్ ఇవ్వాలని సిఐటియు జిల్లా ప్రధానకార్యదర్శి యం రమేష్ డిమాండ్ చేశారు. శనివారం ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా ప్రతినిధి బృందం బాధితులతో కలిసి ఐసిడియస్ ఒంగోలు పి డి ఆఫీస్ వద్ద నిరసన తెలిపారు. ఈ నిరసనలో అంగన్వాడీ యూనియన్ జిల్లా ప్రధానకార్యదర్శి ఈదర అన్నపూర్ణ మాట్లాడుతూ టంగుటూరు ప్రాజెక్టులోని పాకల సెక్టార్ పాకలలో అంగన్వాడీ హెల్పర్‌కు ప్రభుత్వ నిబంధనలు ప్రకారం అన్ని అర్హతలు ఉన్నప్పటికి ప్రమోషన్స్ ఇవ్వకుండా అంగన్వాడీ కార్యకర్త భర్తీకి నోటిఫికేషన్ మంజూరు చేయడం సర్వీసులో ఉన్న హెల్పర్లకు అన్యాయం చేయడమేనన్నారు. కొరిశపాడు ప్రాజెక్టులోని ధేనువకొండలో అంగన్వాడీ కార్యకర్త ఖాళీ అయిన స్థానంలో ప్రమోషన్స్ కు అర్హత ఉన్న హెల్పర్ల నుండి ధరఖాస్తును స్వీకరించకుండా నిరాకరిస్తున్నారు. ప్రకాశంజిల్లాలో మంత్రులు ఇద్దరు ప్రాతినిధ్యం వహిస్తున్న కొండెపి, అద్దంకి నియోజకవర్గాలలోని ప్రాజెక్టులలోనే నిబంధనలకు తూట్లు పొడుస్తూ ఐసిడియస్ అధికారులు తీసుకొంటున్న నిర్ణయాలు ప్రభుత్వ పనితీరుకు నిదర్శనమన్నారు. హెల్పర్లకు ప్రస్తుతం ప్రమోషన్స్ ఇవ్వకుంటే వయస్సు రిత్యా జీవితంలో కార్యకర్త అయ్యే అవకాశం కోల్పోతారన్నారు. ఐసిడియస్ అధికారులు నిబందనలు పాటించేలా మంత్రులు, జిల్లా అధికారులు జోక్యం చేసుకోవాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఇచ్చిన నోటిఫికేషన్ రద్దుచేసి అర్హులైన హెల్పర్లకు ప్రమోషన్స్ ఇవ్వాలన్నారు. లేకుంటే సోమవారం నుండి పోరాటాన్ని తీవ్రతరం చేస్తామన్నారు. ఈ నిరసనలో అంగన్వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు సి హెచ్ ఇందిరావతి, హెల్పర్లు జ్యోతి, సరస్వతి, నాగమ్మలు పాల్గొన్నారు.

## ఆయుష్‌శాఖతో కలిసి డీఎల్ఎస్ఏ ఉచిత వైద్య శిబిరం



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఆగస్టు 1)

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ (డీఎల్ఎస్ఏ) ఒంగోలు ఆధ్వర్యంలో ఆయుష్ శాఖ సహకారంతో శనివారం జిల్లా కోర్టు ప్రాంగణంలోని ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ ఛైర్మన్ ఏ సత్యానంద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉచిత న్యాయ సేవలతో పాటు ప్రజల ఆరోగ్య పరిరక్షణకు దోహదపడే కార్యక్రమాలను జిల్లా న్యాయ సేవాధికార సంస్థ నిరంతరం నిర్వహిస్తోందన్నారు. ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ ఆరోగ్యం పై ప్రత్యేక శ్రద్ధ వహించాలని తద్వారా ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించాలని సూచించారు. ఆయుష్ శాఖ సీనియర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ భ్రమరాంబ ఆయుష్ వైద్య విధానాల ప్రాధాన్యాన్ని వివరించి, హాజరైన న్యాయమూర్తులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అదనపు జిల్లా న్యాయమూర్తులు టి రాజ్యలక్ష్మి, పి లలిత, పూర్ణిమ, శైలజ, కే శ్యాంబాబు, డి దీన, సీనియర్ సివిల్ న్యాయమూర్తులు పల్లవి, రామకృష్ణ, జూనియర్ న్యాయమూర్తులు పాల్గొన్నారు. శిబిరంలో పలువురు వైద్య సేవలను వినియోగించుకున్నారు.

## దేశాయిపేటలో ఘనంగా తల్లిపాల వారోత్సవ ర్యాలీ



(షణ్ముఖ వెలుగు, వేటపాలెం, ఆగస్టు 1)

మండలంలోని దేశాయిపేట సిలోను కాలనీలో శనివారం తల్లిపాల వారోత్సవాల సందర్భంగా అంగన్‌వాడీ శాఖ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ ఝాన్సీ పాల్గొని తల్లిపాల ప్రాముఖ్యతపై మహిళలకు అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ తల్లిపాలు శిశువుకు సంపూర్ణ పోషకాహారమని, పుట్టిన వెంటనే ఇచ్చే ముర్రుపాలు శిశువుకు తొలి వ్యాధి నిరోధక టీకాలా పనిచేస్తాయని తెలిపారు. మొదటి ఆరు నెలల పాటు శిశువుకు తల్లిపాలు మాత్రమే అందించాలని, తద్వారా శిశువు ఆరోగ్యంగా, దృఢంగా ఎదుగుతాడని వివరించారు. తల్లిపాలు ఇవ్వడం వల్ల శిశువుతో పాటు తల్లి ఆరోగ్యానికీ అనేక ప్రయోజనాలు ఉంటాయని చెప్పారు. ప్రతి తల్లి తల్లిపాల ప్రాధాన్యతను గుర్తించి చిన్నారులకు తప్పనిసరిగా తల్లిపాలు అందించాలని పిలుపునిచ్చారు. తల్లిపాల వారోత్సవాలను మండలంలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో వారం రోజుల పాటు వివిధ అవగాహన కార్యక్రమాలతో నిర్వహిస్తున్నట్లు సీడీపీఓ ఝాన్సీ తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు, గర్భిణులు, బాలింతలు, పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొని తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన పొందారు.

## భీమవరం గ్రామంలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ కార్యక్రమం

(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, ఆగస్టు 1)



మండల పరిధిలోని భీమవరం గ్రామంలో శనివారం ఆగస్టు 01 తేదీన ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బందితోపాటు టిడిపి సీనియర్ నాయకులు కాకర్లపూడి వెంకటరామరాజు పాల్గొన్నారు.



# ఆరోగ్యకరమైన ఊపిరితిత్తులతోనే ఆనందకరమైన జీవితం సాధ్యం

(షణ్ముఖ వెలుగు, పర్చూరు, ఆగస్టు 1)
ప్రపంచ ఊపిరితిత్తుల క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా శనివారం ఉదయం ఉప్పుటూరులోని జడ్పీ హైస్కూల్, ప్రభుత్వ హోమియో వైద్యశాల నందు ధూమపానం చేయడం వల్ల వచ్చే ఆరోగ్య సమస్యల గురించి ప్రభుత్వ హోమియో వైద్యులు డాక్టర్ దాసరి చంద్రశేఖర్ అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఉప్పుటూరు ప్రభుత్వ హోమియో వైద్యులు, జిల్లా ఆయుష్ ఆటిజం సెల్ నోడల్ అధికారి డాక్టర్ దాసరి చంద్రశేఖర్ మాట్లాడుతూ మానవుడు భూమిపై పుట్టినప్పటి నుంచి గిట్టే వరకు ఊపిరితిత్తులు నిరంతరం పనిచేస్తూ మనం బతకడానికి అవసరమైన ప్రాణవాయువు (ఆక్సిజన్) అందిస్తాయని, వాటిలో ఉండే చిన్న చిన్న ఆల్వియోలై అనే గాలి గదుల ద్వారా మానవ రక్తంలోకి ప్రాణవాయువు అందించబడి, కార్బన్ డయాక్సైడ్ వంటి చెడువాయువులు బయటకు వెళ్తాయన్నారు. ఇలాంటి అద్భుతమైన శ్వాస కోస అవయవాలు నిరంతరం ధూమపానం చేయడం వల్ల అనేక రకాల వ్యాధులకు గురవుతాయన్నారు. ధూమ్పానం చేయడానికి వాడే చుట్ట లేదా బీడీ లేదా సిగరెట్లో (పొగాకు) 7వేలకు పైగా హానికర కెమికల్స్ ఉంటాయన్నారు. వీటిలో ముఖ్యంగా నికోటిన్, కార్బన్ మోనాక్సైడ్, కార్సినోజెనిక్ ఏజెంట్లు ప్రాణాంతకమైనవని, నికోటిన్ వల్ల రక్తనాళాల్లో కొవ్వు పేరుకుపోవడం వల్ల రక్తనాళాలు సన్నబడి హార్ట్ ఎటాక్ వంటి గుండె జబ్బులు తలెత్తుతాయన్నారు. అలాగే ఊపిరితిత్తులలోని గాలి గొట్టాలను, ఆల్వియోలై నిర్మాణాలను పాడు చేయడం వల్ల ఊపిరితిత్తులకు బ్రాంకిల్ ఆస్తమా, ఎంఫైసీమా, సిఒపిడి, ప్రాణాంతకరమైన లంగ్ క్యాన్సర్ వచ్చే అవకాశం ఉందన్నారు. ఊపిరితిత్తుల క్యాన్సర్ వచ్చిన వెంటనే ప్రారంభ దశలో గుర్తిస్తే వచ్చిన ఊపిరితిత్తులోని భాగాన్ని తీసివేయడం ద్వారా ప్రాణాలు నిలుపుకోవచ్చన్నారు. కానీ ప్రారంభ దశలో గుర్తించ లేకపోతే మాత్రం క్యాన్సర్ వ్యాధిలో ప్రాణాలు నిలపడం వైద్యుడు చేతిలో ఉండదన్నారు. కావున వ్యాధి వచ్చిన తర్వాత బాధపడే కన్నా రాకుండా ముందు నుంచే మంచి అలవాట్లను అలవర్చుకోవాలని, ధూమపానమునకు దూరంగా ఉండాలని, అంతేకాకుండా పరోక్షంగా పొగ తాగడం (పాసివ్ స్మోకింగ్) అంటే సిగరెట్ త్రాగేవారు వదిలే పొగను పీల్చడం చాలా ప్రమాదకరమన్నారు. నేటి విద్యార్థులే... రేపటి భవిష్యత్ తరాలకు పునాదులు గనుక, మీ చుట్టూ ఉన్న వారు కూడా ధూమపానం చేయకుండా నియంత్రించడంలో మీ తల్లిదండ్రులకు, బంధుమిత్రులకు ధూమపానం వల్ల వచ్చే దుష్ప్రభావాలను వివరించి వారు ధూమపానాన్ని మానివేయడంలో మీ వంతు కృషిచేయాలన్నారు. అప్పుడు మాత్రమే మనం ఒక నవీనమైన ఆరోగ్యకర సమాజాన్ని నిర్మించగలమని, మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉందని, దానికోసం అందరూ కలిసికట్టుగా కృషి చేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉప్పుటూరు ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులు, అధ్యాపక బృందం, విద్యార్థిని, విద్యార్థులకు, వైద్యశాలకు వచ్చిన రోగులు, తదితరులు పాల్గొన్నారు.



## అభివృద్ధి... సంక్షేమానికి పెద్దపీట పింఛన్లు పంపిణీ చేసిన టిడిపి ఇన్చార్జి గూడూరి ఎరిక్షన్ బాబు





(షణ్ముఖ వెలుగు, పెద్దారవీడు, ఆగస్టు 1)
కూటమి ప్రభుత్వం సంక్షేమానికి, అభివృద్ధికి పెద్దపీట వేస్తుందని తెదేపా ఇన్చార్జి గూడూరి ఎరిక్షన్ బాబు అన్నారు. శనివారం మండలంలోని తోకపల్లి గ్రామంలో పింఛన్లు పంపిణీ, ఇంటింటికి తెదేపా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నారు. అలాగే రాష్ట్రంలో అనేక పరిశ్రమలు ఏర్పాటు ఉపాధి కల్పిస్తుంటే ప్రతిపక్షాలు మాత్రం విమర్శలు చేస్తున్నారని దుయ్యబట్టారు. కార్యక్రమంలో ఎంపీడీవో జాన్ సుందరం, నాయకులు మండల కన్వీనర్ మెట్టు శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర రోడ్డు డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ నక్క శ్రీను, నాగేశ్వరరావు, నాయకులు మిల్లు కొండారెడ్డి, చిన్న కొండారెడ్డి, ఆనకల శ్రీనివాసరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

## ఎరిక్షన్ బాబు సమక్షంలో తెలుగుదేశం పార్టీ తీర్థం పుచ్చుకున్న ప్రముఖ పారిశ్రామికవేత్త సురవరం వీర రాఘవరెడ్డి, సురవరం ఇంద్రసేనారెడ్డి (లండన్)




(షణ్ముఖ వెలుగు, దోర్నాల, ఆగస్టు 1)
దోర్నాల పట్టణంలోని నటరాజ్ సెంటర్ నుండి దీవీ గ్రాండ్ ఫంక్షన్ హాల్ వరకు భారీ ర్యాలీగా వెళ్లి దోర్నాల మండలం పెద్ద బొమ్మలపురం గ్రామానికి చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త సీనియర్ నాయకులు సురవరం వీర రాఘవరెడ్డి, వారి తనయుడు సురవరం ఇంద్రసేనారెడ్డి (లండన్)లకు యర్రగొండపాలెం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్చార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబు సమక్షంలో తెలుగుదేశం పార్టీ కండవా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. అలాగే సురవరం వీర రాఘవరెడ్డి జన్మదినం సందర్భంగా గూడూరి ఎరిక్షన్ బాబు కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## శక్తి యాప్ పై విద్యార్థినులకు అవగాహన




(షణ్ముఖ వెలుగు, చీరాల, ఆగస్టు 1)
సబ్ డివిజన్ శక్తి బృందం ఆధ్వర్యంలో శనివారం ఈపురుపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలోని రామాపురం బీచ్ రోడ్డులో ఉన్న చీరాల ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థినులకు శక్తి యాప్ వినియోగంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బాపట్ల జిల్లా ఎస్పీ బి ఉమామహేశ్వర్ ఆదేశాల మేరకు డీఎస్పీ ఎండి మోయిన్ సూచనలతో సీఐ సుధాకర్, ఎస్ఐ ఆంజనేయులు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో శక్తి టీం కానిస్టేబుల్ కె సుబ్బారావు మాట్లాడుతూ ఈవ్‌టీజింగ్, సోషల్ మీడియా వేధింపులు, వెంటపడటం వంటి ఘటనలను సహించకుండా వెంటనే శక్తి యాప్ లేదా 112కు సమాచారం ఇవ్వాలని సూచించారు. మహిళల భద్రతకు ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలని, విద్యార్థినులు ఆత్మరక్షణ నైపుణ్యాలు, చట్టాల పై అవగాహన పెంపొందించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జగదీష్, సీఈఓ వేణుప్రసాద్ పాల్గొన్నారు.

# శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణతో పాటు

### చట్టవ్యతిరేక, అసాంఘిక కార్యకలాపాల పై ఉక్కుపాదం మోపుతూ సమర్థవంతంగా విధులు నిర్వహిస్తున్న ప్రకాశం, మార్కాపురం జిల్లా పోలీసులు




(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, ఆగస్టు 1)
ప్రకాశం, మార్కాపురం జిల్లాలలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్‌రాజు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రకాశం, మార్కాపురం జిల్లాల్లో పోలీసులు విస్తృత తనిఖీలు నిర్వహిస్తూ, చట్టవ్యతిరేక, అసాంఘిక కార్యకలాపాలను అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. గంజాయి అక్రమ రవాణాను అరికట్టడంలో భాగంగా 3 కేసులు నమోదు చేసి 11 మందిని అరెస్ట్ చేసి సుమారు 8.890 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. జిల్లాలో కోడిపందాలు, పేకాట, మట్కా వంటి జూద కార్యకలాపాలపై ప్రత్యేక దాడులు నిర్వహించి మొత్తం 239 మందిని అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా 46 కేసులు నమోదు చేయబడగా, వారి వద్ద నుండి రూ.12,43,870 నగదు, 5 కోళ్లు, 37 మోటార్ సైకిళ్లు, 48 మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ప్రకాశం, మార్కాపురం జిల్లాలలో ఉన్న 922 మందిని చెడునడతగల వారికి (రౌడీ షీటర్ల) కౌన్సిలింగ్ నిర్వహించి, సత్ప్రవర్తనతో అందరితో కలసిపోయి మంచిగా జీవనం సాగించాలన్నారు. వ్యవహార శైలి మార్చుకోకపోయినా, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడిన, చట్టాన్ని అతిక్రమించి దౌర్జన్యాలు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించిన వారిపై 2,669 కేసులు నమోదు చేయడం జరిగింది. అదేవిధంగా ఇలాంటి కార్యకలాపాలు జరుగుతున్న 853 ప్రదేశాలను శుభ్రపరచడం జరిగింది. రోడ్లను ఆక్రమించి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్న 3,581 మంది చిరు వ్యాపారులపై టౌన్ న్యూసెన్స్ యాక్ట్ కింద కేసులు నమోదు చేసి కోర్టులో జరిమానాలు, శిక్షలు విధింపజేశారు. మోటారు వాహన చట్టం కింద ద్విచక్ర వాహనాలు, కార్లు, ఆటోల పై మొత్తం 11,127 ఈ చలానా ద్వారా కేసులు నమోదు చేసి జరిమానాలు విధించారు. డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో 396 మంది వాహనదారులను పట్టుకుని గౌరవ కోర్టులలో హాజరు పరచగా కోర్టు వారు రూ.12,62,000 జరిమానాలు విధించారు. జిల్లా వ్యాప్తంగా రాత్రి, పగలు గస్తీ నిర్వహిస్తూ పాతనేరస్తులపై నిఘా ఉంచి అనుమానితులను విచారించి, అవసరమైన మేరకు బైండ్ ఓవర్ చేయడం, కౌన్సెలింగ్ నిర్వహించటం జరిగింది. డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు తమ పరిధిలో గ్రామాలు, వార్డులను సందర్శించి ప్రజలతో ముఖాముఖి మాట్లాడి, దొంగతనాలు జరగకుండా తీసుకోవలసిన చర్యలు, సీసీ కెమెరాలు, మహిళా చట్టాలు, గంజాయి మరియు ఇతర మాదకద్రవ్యాల అనర్థాలు, చట్టపరమైన శిక్షలు గురించి అవగాహన కల్పించారు. అలాగే సైబర్ నేరాలు, లోన్ యాప్స్, క్రికెట్ బెట్టింగ్, రహదారి భద్రత నియమాలు, హెల్మెట్ వినియోగం, కొత్త క్రిమినల్ చట్టాలపై విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నారు. చట్టాన్ని అతిక్రమించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవటం జరుగుతుందని జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్‌రాజు స్పష్టం చేశారు.

# పొన్నలూరులో ఇంటింటికి టిడిపి

(షణ్ముఖ వెలుగు, పొన్నలూరు, ఆగస్టు 1)
మండల కేంద్రమైన పొన్నలూరు అంబేద్కర్ కాలనీలో శనివారం ఇంటింటికి టిడిపి కార్యక్రమం నిర్వహించారు. దీనిలో భాగంగా మండవ ప్రసాద్ మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్లలోనే ఇచ్చిన హామీలు నెరవేర్చని ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కి దక్కుతుందని తెలిపారు. ప్రతి ఇంటికి వెళ్లి వారిని ఆప్యాయంగా పలకరించి అభివృద్ధి,సంక్షేమ గురించి వివరించారు. ఏమైనా సమస్యలు ఉంటే మా దృష్టికి తేవాలని వారికి సూచించారు. ఈ కార్యక్రమంలో మండవ మురళీమోహన్, నల్లపనేని రాము, నేలపాడు రాజేష్, వెంకటేశ్వర్లు, చుండి సింగయ్య, రమేష్ బాబు, తదితరులు పాల్గొన్నారు.



## అర్హులైన బడుగుల బాగు కోసమే 'ఎన్టీఆర్ భరోసా' పింఛన్లు

### జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత లబ్ధిదారుల ఇళ్ల వద్దకే వెళ్లి ఆర్థిక సాయం అందించడమే ప్రభుత్వ ముఖ్య ఉద్దేశం





(షణ్ముఖ వెలుగు, పెద్దారవీడు, ఆగస్టు 1)
రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 'ఎన్టీఆర్ భరోసా' పింఛన్ల పథకం ద్వారా అర్హులైన లబ్ధిదారులకు సకాలంలో ఆర్థిక సహాయం అందిస్తున్నామని మార్కాపురం జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత తెలిపారు. మండలంలోని దేవరాజుగట్టు గ్రామంలోని బి.సి కాలనీలో నిర్వహించిన 'ఎన్టీఆర్ భరోసా' పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా బి.సి కాలనీలో లబ్ధిదారుల ఇళ్ల వద్దకే స్వయంగా వెళ్లిన కలెక్టర్, వారికి పింఛను సొమ్మును అందజేసి, వారిని ఆప్యాయ పలకరించి, స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వృద్ధులు, వికలాంగులు, వితంతువులు, ఇతర ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు నైతిక, ఆర్థిక భరోసా కల్పించడమే ఈ పథకం యొక్క ప్రాథమిక లక్ష్యం. లబ్ధిదారులు కార్యాలయాల చుట్టూ తిరిగే అవసరం లేకుండా, ప్రతి నెలా మొదటి తేదీనే వారి గుమ్మం వద్దకే వచ్చి పింఛను అందజేసేలా జిల్లా యంత్రాంగం పక్కా చర్యలు చేపట్టిందని పేర్కొన్నారు. పింఛన్ల పంపిణీలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా క్షేత్రస్థాయి అధికారులను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తున్నామని తెలిపారు. గ్రామంలో స్థానిక లబ్ధిదారులతో కలెక్టర్ కాసేపు ముచ్చటించి, ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు. పింఛను సొమ్మును సద్వినియోగం చేసుకోవాలని లబ్ధిదారులకు సూచించారు. ఈ పంపిణీ కార్యక్రమంలో డ్వామా పీడీ శివన్నారాయణ, స్థానిక తహశీల్దార్, ఎంపీడీఓ, గ్రామ సచివాలయాల సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

# అంగన్‌వాడీ కేంద్రంలో ప్రపంచ తల్లిపాలు వారోత్సవాల కార్యక్రమం

**(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, ఆగస్టు 1)**

ఆగస్టు 1వ తేదీ నుండి 7వతేది వరకు జరిగే తల్లిపాలు వారోత్సవాలలో భాగంగా ఉలవపాడు సెక్టార్ లోని ఉలవపాడు 4వ అంగన్వాడి సెంటర్ నందు సిడిపిఓ డి మాధవిలత ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కరేడు పీహెచ్సీ డాక్టర్ శ్రీజ రెడ్డి, ఐసిడిఎస్ సిడిపిఓ మాధవి లత తర్వాత పిహెచ్సి ఏఎన్ఎమ్స్, సూపర్వైజర్స్, ఏడబ్ల్యుడబ్ల్యు, ఈఆర్ఎస్ అందరూ కూడా పాల్గొన్నారు. శ్రీజరెడ్డి ప్రతి బిడ్డకి తల్లిపాలు ఎంత త్వరగా ఇవ్వగలమో అంత తొందరగా ఇవ్వాలి ప్లస్ తల్లిపాలు వలన కలిగే ప్రయోజనాలు తల్లి పాలు బిడ్డకు రెండు సంవత్సరాల దాకా ఇవ్వవలెను 7 నెలల నుండి తల్లిపాలుతో పాటు సరిపడినంత ఆహారం కూడా ఇవ్వాలని డాక్టర్ సూచనలు ఇచ్చారు. తల్లులకి మాధవి లత మేడం తల్లి పాలల్లో ముందుగా వచ్చే పసుపచ్చని ముర్రుపాల గురించి, పాలల్లో ఉండే కొలెస్ట్రాంగ్ గురించి పుట్టిన ఒక గంటలోనే తల్లిపాలు ఇవ్వాలి. ప్రతి తల్లికి చెప్పారు బిడ్డ గోరినప్పుడల్లా తల్లిపాలు పగలు రాత్రి చూడకుండా ఇవ్వాలి. కానీ తల్లి గాని పాలు ఇవ్వనిచ్చావ్ పాలు ఇవ్వనిచో తల్లికి వచ్చే రొమ్ము క్యాన్సర్ గురించి గర్భసంచి క్యాన్సర్ గురించి కూడా వివరించారు.



అలానే తల్లిపాలుతో పాటు తల్లిపాలు ఇస్తూ ఉంటే బిడ్డలకి ఆరు నెలల లోపు వరకు వేరే నీరు కూడా అవసరం లేదని కూడా చెప్పారు తర్వాత డబ్బాపాలు అసలకే ఇవ్వద్దని అన్నారు. తల్లిపాలు ఆరు నెలలు పూర్తయ్యాక తల్లిపాలుతో పాటు పోస్ట్కి ఆహారం కూడా ఏడో నెల నుంచి అంగన్వాడీలో ఇచ్చే బాలామృతము బిడ్డకు అనుకూలంగా ఎలా తింటారో అలా అనుకూలంగా ఉండేటట్టుగా పెట్టాలి అలానే కోడిగుడ్డు గురించి కూడా చెప్పారు. ఈ విధంగా చిన్న చిన్న ఫ్రూప్ట్ కూడా చిన్న చిన్నగా బిడ్డ తినే దాన్నిబట్టి కూడా పెట్టాలని వివరించారు. ఈ కార్యక్రమంలో తల్లులు, సూపర్వైజర్స్ కె రమాదేవి, ఎం నాగలక్ష్మి పాల్గొన్నారు.







# పేదల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యం

## జిల్లా కలెక్టర్ పి రాజాబాబు

**(షణ్ముఖ వెలుగు, దర్శి, ఆగస్టు 1)**

పేదల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు జిల్లా కలెక్టర్ పి రాజాబాబు చెప్పారు. ప్రతి నెల 1వ తేదీన పెద్ద మొత్తంలో ఇస్తున్న ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీయే దీనికి నిదర్శనమన్నారు. ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, దర్శి నియోజకవర్గ టిడిపి ఇన్చార్జి గొట్టిపాటి లక్ష్మితో కలిసి శుక్రవారం ఆయన దర్శి పట్టణంలోని సందువారిపాలెంలో పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. లబ్ధిదారులతో వారు ఆప్యాయంగా మాట్లాడి యోగక్షేమాలు తెలుసుకున్నారు. బలహీన వర్గాలకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉందని కలెక్టర్ తెలిపారు. అర్హులందరికీ సంక్షేమ పథకాల ప్రయోజనాలను అందిస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు పెన్షన్ నగదును వారు అందించారు. అనంతరం పట్టణంలోని రెండవ వార్డు హిందూ స్మశానవాటికకు రూ.49 లక్షలతో నిర్మించిన ప్రహరీ గోడ ప్రారంభోత్సవ శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారి వెంట ఆర్డిఓ విజయ కుమారి, తహసిల్దార్ రజనీకుమారి, ఇతర అధికారులు ఉన్నారు. తమ ప్రాంతానికి వచ్చిన కలెక్టర్, ఎంపీ, గొట్టిపాటి లక్ష్మీకి స్థానికులు సాదర స్వాగతం పలికారు.









# జిల్లా స్థాయి అమరావతి ఛాంపియన్‌షిప్ కు ఎంపికైన చాకిచర్ల విద్యార్థులు



**(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, ఆగస్టు 1)**

ఉలవపాడు మండలం చాకిచర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు జిల్లా స్థాయి అమరావతి ఛాంపియన్‌షిప్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె జనార్ధన్‌రావు తెలియశారు. గత నెల 30, 31 తేదీలలో కందుకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి ఎంపిక పోటీలలో చాకిచర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయి పోటీలకు అర్హత సాధించారు. బాలికల విభాగంలో అరిగెపోగు కీర్తిక (10వ తరగతి) లాంగ్ జంప్‌లో ప్రథమ స్థానం, 100 మీటర్ల పరుగు పోటీలో ద్వితీయ స్థానం, బసంగారి మాధురి (9వ తరగతి) హైజంప్‌లో ప్రథమ స్థానం, పెల్లేటి జెస్సినీ ప్రియ (9వ తరగతి) 800 మీటర్ల పరుగు పోటీలో ప్రథమ స్థానం, కరేటి వినయశ్రీ (8వ తరగతి) షాట్‌పుట్‌లో ద్వితీయ స్థానం, మిరియం వెంకటనాగ హరిణి శ్రీ (8వ తరగతి) హైజంప్‌లో ద్వితీయ స్థానం, ఓటుకూరి మమత (7వ తరగతి) 800 మీటర్ల పరుగు పోటీలో ద్వితీయ స్థానం దక్కించుకున్నారు. బాలుర విభాగంలో బాపనపల్లి మహిధర్ (9వ తరగతి) లాంగ్ జంప్‌లో ప్రథమ స్థానం, నితీష్ హైజంప్‌లో ప్రథమ స్థానం, దర్శి వెంకట వరుణ్ తేజ లాంగ్ జంప్‌లో ద్వితీయ స్థానం సాధించారు.

ఈ విద్యార్థులు ఆగస్టు నెలలో నిర్వహించనున్న జిల్లా స్థాయి అమరావతి ఛాంపియన్‌షిప్ పోటీలలో పాల్గొననున్నట్లు పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ ఒగుబోయిన శ్రీనివాసులు తెలిపారు. శనివారం పాఠశాలలో నిర్వహించిన అభినందన కార్యక్రమంలో ఎంపికైన విద్యార్థులను పాఠశాల తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ రావి సుధాకర్, ప్రధానోపాధ్యాయులు కె జనార్ధన్‌రావు, సీనియర్ ఉపాధ్యాయులు నారాయణ, ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది, గ్రామస్తులు అభినందించి జిల్లా స్థాయి పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరచాలని ఆకాంక్షించారు..

# ప్రధానమంత్రి ఫసల్ భీమా యోజన పథకం నమోదు గడువు ఆగస్టు 15 వరకు పొడగింపు

**(షణ్ముఖ వెలుగు, తర్లుపాడు, ఆగస్టు 1)**



తర్లుపాడు మండల వ్యవసాయ అధికారిని పిజోష్నాదేవి పాత్రికేయులతో మాట్లాడుతూ నోటిఫైడ్, పంటలు, జిల్లాలకు (అన్ని తొమ్మిది క్లస్టర్లకు) పిఎంఎఫ్‌బివై నమోదు గడువు ఈ నెల 15 వరకు పొడిగించడం జరిగిదని మండల వ్యవసాయ అధికారిని పి జోష్నాదేవి తెలిపారు. ఈగడువరిపంటకు కూడావర్తిస్తుందన్నారు. దీనికనుగుణంగాఎన్, సిఐపిపోర్టల్లో నమోదుప్రక్రియతిరిగిప్రారంభించదానికి భారత ప్రభుత్వానికి ప్రతిపాదనలుసమర్పించడం జరిగిందన్నారు. ఆర్‌డబ్ల్యుబిసిఐఎస్ నమోదు ప్రక్రియ జులై 31 రాత్రికి ముగుస్తుంది. కాబట్టి దీనికి ఇక పై గడువు పొడిగింపు సాధ్యం కాదు కనుక రైతులు, క్షేత్రస్థాయి సిబ్బంది అదే రోజు ఆర్‌డబ్ల్యూబిసిఐఎస్ న మోదుకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించడమైందన్నారు. ఇతర నోటిఫైడ్ పంటలకు పిఎమ్ఎఫ్‌బివై నమోదు ప్రక్రియను ఆగస్టు 15 వరకు భారత ప్రభుత్వం పొడిగించడం జరిగిందన్నారు. ఈ అవకాశాన్ని మండల రైతు సోదరులందరూ సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారిని కోరారు.

# సోమవరప్పాడులో ఘనంగా తల్లిపాల వారోత్సవాలు



**(షణ్ముఖ వెలుగు, కొరిశపాడు, ఆగస్టు 1)**

సోమవరప్పాడులోని అంగన్‌వాడీ కేంద్ర నందు శనివారం జాతీయ తల్లిపాల వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ సూపర్వైజర్ అరుణాదేవి పాల్గొని మాట్లాడుతూ, ప్రతి శిశువుకు తల్లిపాలే తొలి సంపూర్ణ ఆహారమని, పుట్టిన గంటలోపే తల్లిపాలు పట్టించడం ద్వారా శిశువుకు మెరుగైన రోగనిరోధక శక్తి లభిస్తుందని తెలిపారు. తొలి ఆరు నెలల వరకు శిశువుకు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని, తద్వారా చిన్నారులు ఆరోగ్యంగా ఎదుగుతారని సూచించారు. సెక్టార్ పరిధిలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో వారం రోజులపాటు తల్లిపాల వారోత్సవాలను నిర్వహిస్తూ గర్భిణులు, బాలింతలు, చిన్నారుల తల్లిదండ్రులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. తల్లిపాల విశిష్టత, శిశువుల ఎదుగుదలలో వాటి పాత్ర, తల్లిపాలు అందించడం వల్ల తల్లి, బిడ్డ ఇద్దరికీ కలిగే ఆరోగ్య ప్రయోజనాలపై కార్యకర్తలు విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు కల్పన, కెజియ, కిరణ్మయి, అనురాధ, రమాదేవి, బాలింతలు, గర్భిణులు, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించిన కో కన్వీనర్ షేక్ ఖాజావలి



**(షణ్ముఖ వెలుగు, కంభం, ఆగస్టు 1)**

మండలంలోని కందులాపురం గ్రామంలో బూత్ నెం.40 పరిధిలో "ఇంటింటికి తెలుగుదేశం" కార్యక్రమాన్ని బూత్ కో కన్వీనర్ షేక్ ఖాజావలి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. గిద్దలూరు నియోజకవర్గ ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి ఆదేశాల మేరకు ఇంటింటికీ వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. అలాగే ప్రభుత్వ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచిస్తూ, ప్రజల సమస్యలను తెలుసుకుని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక తెలుగుదేశంపార్టీ నాయకులు, కార్యకర్తలు, బూత్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL/2023/89152, e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com

## ప్రజా సంక్షేమమే ధ్యేయం

**అపర భగీరథుడు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్**
**ఎమ్మెల్యే ఆదేశాలతో ఎర్ర చెరువుకు తెలుగుగంగ నీటిని విడుదల చేసిన మార్కెట్ యార్డ్ కమిటీ చైర్మన్ ఎపి రవీంద్ర**
**వరుసగా 9వ సారి మైదుకూరు ఎర్ర చెరువుకు నీటి తరలింపు**
**మైదుకూరు మున్సిపాలిటీ, వనిపెంట సమీప గ్రామాల భూగర్భ జలాల వృద్ధి,**
**తాగు, సాగునీటి కష్టాలు తీర్చిన ఎమ్మెల్యే పుట్టాకి ప్రజల నీరాజనాలు**





**(షణ్ముఖ వెలుగు, మైదుకూరు, ఆగస్టు 1)**

మైదుకూరు ప్రాంతంలో వర్షాభావ పరిస్థితుల వల్ల భూగర్భ జలాలు అడుగంటిపోకుండా, ప్రజలకు తాగు, సాగునీటి ఎద్దడి రాకూడదనే దూరదృష్టితో స్థానిక ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ ఆదేశాల మేరకు మైదుకూరు మార్కెట్ యార్డ్ కమిటీ చైర్మన్ ఎ.పి. రవీంద్ర, అధికారులు, నాయకులతో కలిసి ఎర్ర చెరువుకు తెలుగుగంగ నీటిని విడుదల చేశారు. ఎమ్మెల్యే ప్రత్యేక చొరవతో వరుసగా 9వ సారి ఎర్ర చెరువుకు నీటిని రప్పించడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా మార్కెట్ యార్డ్ కమిటీ చైర్మన్ ఎపి రవీంద్ర, ఇతర నాయకులు మాట్లాడుతూ ఎర్ర చెరువు నీటితో నిండడం ద్వారా కేవలం మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలకే కాకుండా, వనిపెంట మరియు దాని సమీప గ్రామాలలోని భూగర్భ జల మట్టాలు గణనీయంగా పెరుగుతాయని తెలిపారు. దీనివల్ల ఆయా ప్రాంతాల ప్రజల తాగునీటి అవసరాలు తీరడంతో పాటు, వ్యవసాయ బావుల్లో నీటి మట్టం పెరిగి రైతులకు సాగునీరు పుష్కలంగా అందుబాటులోకి వస్తుందన్నారు. ఎల్లప్పుడూ నియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తూ, తాగు, సాగునీటి కష్టాలను తీరుస్తున్న "అపర భగీరథుడు" ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్‌కి మైదుకూరు మున్సిపాలిటీ ప్రజలు, వనిపెంట సమీప గ్రామాల రైతులు, ప్రజలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మైదుకూరు మార్కెట్ యార్డ్ కమిటీ చైర్మన్ ఎపి రవీంద్ర, తెలుగుగంగ ప్రాజెక్టు అధికారులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

**(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, ఆగస్టు 1)**

ఆదివారం 33/11కేవీ ఉలవపాడు సబ్ స్టేషన్‌లోని 11కేవీ కె రాజుపాలెం ఫీడర్, 11 కేవీ ఎక్స్‌ప్రెస్ ఫీడర్, 33/11 కేవీ మన్నేటికోట సబ్ స్టేషన్‌లోని 11 కేవీ హైవే ఎక్స్‌ప్రెస్ ఫీడర్ మరమ్మతుల నిమిత్తంగా మన్నేటికోట హైవే పక్కన ఉన్న హోటల్స్‌కి ఎల్ రాజుపాలెం, కె రాజుపాలెం, సాయిబాబా గుడి, దాని పరిసర గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిలిపివేయబడుతుందని డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సింగరాయకొండ సబ్ డివిజన్ తెలిపారు. కావున వినియోగదారులు ఈ అంతరాయానికి సహకరించాల్సిందిగా ప్రార్థన.

## హేయ్యర్ సేవలకు ఘన నివాళి



**(షణ్ముఖ వెలుగు, చీరాల, ఆగస్టు 1)**

స్థానిక సెయింట్ మార్క్స్ లూథరన్ జూనియర్ కళాశాలలో ప్రముఖ సువార్త సేవకుడు రెవ. డాక్టర్ జాన్ క్రిస్టియన్ ఫ్రెడ్రిక్ హేయ్యర్ సేవలను స్మరించుకుంటూ శనివారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల అధ్యక్షులు వేముల డానియల్ ఐజక్సన్ రెవ. హేయ్యర్, డాక్టర్ మార్టిన్ లూథర్ చిత్రపటాలను కళాశాలకు బహూకరించారు. కరస్పాండెంట్ శీలం విద్యాసాగర్, ప్రిన్సిపాల్ గారపాటి పుష్పరాజు, రెవ. నాని బాబు మాట్లాడుతూ హేయ్యర్ విద్య, వైద్యం, సువార్త ప్రచార రంగాల్లో అందించిన విశిష్ట సేవలను కొనియాడారు. సమాజాభివృద్ధికి ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొని హేయ్యర్ సేవలను స్మరించుకున్నారు.

# రూ.804 కోట్లతో కడపకు సమగ్ర రూపకల్పన




**కడప నగరపాలక సంస్థ ప్రత్యేక అధికారి, జిల్లా కలెక్టర్ డా శ్రీధర్ చెరుకూరి**
**తాగునీటి నుంచి సీవరేజ్ వరకు**
**రహదారుల నుంచి చెరువుల పునరుద్ధరణ వరకు సమగ్ర అభివృద్ధి**
**నగరాన్ని 'స్వచ్ఛ స్వర్ణ నగరం'గా తీర్చిదిద్దడమే లక్ష్యం**
**నాణ్యత, పారదర్శకత, ప్రజాసేవలో రాజీ పడొద్దని అధికారులకు ఆదేశాలు**





**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, కడప, ఆగస్టు 1)**

ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడేలా రూ.804 కోట్లతో కడప నగర రూపురేఖలు మారనున్నాయని, ప్రతి రూపాయి ప్రజలకు శాశ్వత ప్రయోజనం చేకూర్చేలా అభివృద్ధి పనులు చేపట్టాలని కడప నగరపాలక సంస్థ ప్రత్యేక అధికారి జిల్లా కలెక్టర్ డాక్టర్ చెరుకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. శనివారం కడప నగరపాలక సంస్థ బోర్డు మీటింగ్ హాలులో ప్రత్యేక అధికారి, జిల్లా కలెక్టర్ డాక్టర్ చెరుకూరి శ్రీధర్ అధ్యక్షతన కేఎంసీ జనరల్ బాడీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో నగర అభివృద్ధికి సంబంధించిన పలు కీలక ప్రతిపాదనలను సమీక్షించి ఆమోదం తెలుపడంతో పాటు, ప్రజలకు మెరుగైన పౌర సేవలు అందించేలా అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. కడప నగరాన్ని ఆధునిక మౌలిక సదుపాయాలతో రాష్ట్రంలోనే ఆదర్శ నగరంగా తీర్చిదిద్దే దిశగా నగరపాలక సంస్థ కీలక అడుగు వేసిందని జిల్లా కలెక్టర్ తెలిపారు. మొత్తం రూ.804.62 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు కడప నగరపాలక సంస్థ సాధారణ సర్వసభ్య సమావేశంలో ఆమోదం లభించడం జరిగిందన్నారు. నగరంలో తాగునీటి సరఫరా, మురుగునీటి వ్యవస్థ, సీసీ రహదారులు, డ్రైనేజీ, చెరువుల పునరుద్ధరణ, పారిశుధ్యం, టౌన్ ప్లానింగ్, పన్నుల వసూళ్లు, పచ్చదనం, ప్రజా భద్రత వంటి ప్రతి అంశంలో నాణ్యతతో కూడిన అభివృద్ధి పనులు చేపట్టాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సందర్భంగా రూ.804.62 కోట్లతో నగర సమగ్ర అభివృద్ధి కోసం ప్రతిపాదించి, ఆమోదం పొందిన అభివృద్ధి పనుల వివరాలను తెలిపారు. అమృత్ 2.0 పథకం కింద తాగునీటి సరఫరా వ్యవస్థ బలోపేతానికి రూ.592.23 కోట్లు, సీవరేజ్, సెప్టేజ్ నిర్వహణ వ్యవస్థ అభివృద్ధికి రూ.70.82 కోట్లు, పుట్లంపల్లి, దేవుని కడప చెరువుల పునరుద్ధరణకు రూ.83.45 కోట్లు, 15వ ఆర్థిక సంఘం నిధులతో సీసీ రహదారులు, డ్రైన్లు, తాగునీటి సరఫరా, ఘన వ్యర్థాల నిర్వహణ పనులకు రూ.25.87 కోట్లు, నగరపాలక సంస్థ సాధారణ నిధులతో సీసీ రహదారులు, డ్రైనేజీ పనులకు రూ.32.25 కోట్లు, మొత్తంగా రూ.804.62 కోట్లతో నగర మౌలిక వసతులను బలోపేతం చేస్తూ, ప్రజలకు దీర్ఘకాలిక ప్రయోజనం కలిగించే అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేయనున్నట్లు తెలిపారు.

**పారిశుధ్య కార్మికులకు వేతనాల పెంపు..**

నగర పరిశుభ్రత కోసం నిరంతరం శ్రమిస్తున్న 439 మంది పబ్లిక్ హెల్త్ కార్మికుల రోజువారీ వేతనాన్ని రూ.400 నుంచి రూ.500కు పెంచాలని సమావేశంలో నిర్ణయించారు. దీంతో వారి నెలవారీ ఆదాయం రూ.12 వేల నుంచి రూ.15 వేల వరకు పెరగనుంది. ఎఫ్ఆర్ఎస్ నమోదు లేకుండా ఎటువంటి చెల్లింపులు చేయరాదని కలెక్టర్ స్పష్టం చేశారు.

**అక్రమ నిర్మాణాలపై రాజీ లేదు..**

నగరంలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన భవనాలపై కఠిన చర్యలు తీసుకోవాలని టౌన్ ప్లానింగ్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. భవన అనుమతుల మంజూరులో రాజకీయ జోక్యానికి తావులేకుండా పారదర్శకంగా వ్యవహరించాలని సూచించారు. పట్టణాభివృద్ధి శాఖ నిబంధనలను ఖచ్చితంగా అమలు చేసి ప్రజల్లో విశ్వాసం పెంచేలా పనిచేయాలని పేర్కొన్నారు. అలాగే టౌన్ ప్లానింగ్ అధికారులు, సిబ్బంది, బిల్డర్లకు త్వరలో ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించి నిబంధనలపై స్పష్టత కల్పించాలని ఆదేశించారు.

**పన్నుల వసూళ్లకు ప్రత్యేక కార్యాచరణ..**

నగరపాలక సంస్థ ఆర్థిక బలోపేతానికి పన్నుల వసూళ్లను వేగవంతం చేయాలని కలెక్టర్ సూచించారు. బకాయిలు చెల్లించని వారి వివరాలు సేకరించి ప్రత్యేక కార్యాచరణతో వసూళ్లు చేపట్టాలని, ప్రజలు స్వచ్ఛందంగా పన్నులు చెల్లించేలా విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు.

**పారిశుధ్యం, పచ్చదనం, ప్రజా భద్రతపై ప్రత్యేక దృష్టి....**

నగరంలో నిరంతర తాగునీటి సరఫరా, సమర్థవంతమైన డ్రైనేజీ వ్యవస్థ, నాణ్యమైన సీసీ రహదారులు, పరిశుభ్రమైన వాతావరణం కల్పించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. నగర సుందరీకరణలో భాగంగా పార్కుల అభివృద్ధి, పచ్చదనం పెంపుపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ప్రజల భద్రత కోసం ప్రధాన కూడళ్లు, జనసంచారం అధికంగా ఉండే ప్రాంతాల్లో పోలీసు శాఖతో సమన్వయం చేసుకుని సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. అన్నా క్యాంటీన్ల నిర్వహణను నిరంతరం పర్యవేక్షించి ప్రజలకు నాణ్యమైన సేవలు అందేలా చూడాలని చెప్పారు.

**'స్వచ్ఛ స్వర్ణ నగరం' గా కడపకు గుర్తింపు తీసుకురావాలి..**

కడప నగరపాలక సంస్థ సేవలు, పరిశుభ్రత, పచ్చదనం, పట్టణ ప్రణాళిక అమలులో రాష్ట్రంలోనే ఆదర్శంగా నిలవాలని, ప్రతి అధికారి బాధ్యతాయుతంగా పనిచేయాలని జిల్లా కలెక్టర్, కడప నగరపాలక సంస్థ ప్రత్యేక అధికారి డాక్టర్ చెరుకూరి శ్రీధర్ స్పష్టం చేశారు. అభివృద్ధి పనుల్లో నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ లేకుండా నిర్ణీత గడువులో పూర్తి చేసి ప్రజలకు మెరుగైన పౌర సేవలు అందించాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో నగరపాలక సంస్థ కమిషనర్ డాక్టర్ పి భవాని ప్రసాద్, అదనపు కమిషనర్ రాకేష్ చంద్రం, ఎస్ఈ చెన్నకేశవరెడ్డి, మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు, మున్సిపల్ కార్పోరేషన్ ఇంజినీర్లతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# తల్లి ముర్రుపాలే.. శిశువుకు తొలి సహజ టీకా

## వైద్యాధికారి డాక్టర్ పి ఓబులేసు

**నక్కలదిన్నె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఘనంగా 'ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు'**
**ఆగస్టు 1 నుండి 7 వరకు**
**అన్ని సచివాలయాల్లో అవగాహన కార్యక్రమాలు**




**(షణ్ముఖ వెలుగు, చాపాడు, ఆగస్టు 1)**

నవజాత శిశువుకు తల్లి ఇచ్చే ముర్రుపాలు మొదటి సహజ టీకా లాగా పనిచేస్తాయని, బిడ్డ శారీరక, మానసిక వికాసానికి తల్లిపాలు అత్యంత ఆవశ్యకమని నక్కలదిన్నె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ పి. ఓబులేసు తెలిపారు. చాపాడు మండలంలోని లక్ష్మీపేట సచివాలయ పరిధిగల అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం 'ప్రపంచ తల్లిపాల వారోత్సవాల' ప్రారంభోత్సవ కార్యక్రమం డాక్టర్ ఓబులేసు ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ ఓబులేసు మాట్లాడుతూ పుట్టిన మొదటి గంటలోనే బిడ్డకు తల్లిపాలు పట్టడం ఉత్తమమైన జీవిత ప్రారంభమని చెప్పారు. పుట్టిన వెంటనే వచ్చే పసుపు రంగు చిక్కటి ముర్రుపాలు శిశువుకు అద్భుతమైన రోగనిరోధక శక్తిని అందించి డయేరియా, న్యుమోనియా, అలర్జీలు వంటి వ్యాధుల నుండి కాపాడుతాయన్నారు. తల్లిపాలు ఎప్పుడూ పరిశుభ్రంగా, సరైన ఉష్ణోగ్రతలో అందుబాటులో ఉంటాయని, ఇవి తల్లి, బిడ్డల మధ్య ఆప్యాయత, భద్రతా భావాన్ని పెంచుతాయని తెలిపారు. అనంతరం ఆరోగ్య విస్తరణ అధికారి యం. రాఘవయ్య మాట్లాడుతూ శిశువు పుట్టిన మొదటి 6 నెలల వరకు మంచి నీళ్లు కూడా ఇవ్వకుండా కేవలం తల్లిపాలు మాత్రమే పట్టాలని సూచించారు. ఇది బిడ్డ మెదడు ఎదుగుదలకు, జ్ఞాపకశక్తి అభివృద్ధికి ఎంతగానో తోడ్పడుతుందన్నారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ విజయేశ్వరి మాట్లాడుతూ ప్రకృతి ప్రసాదించిన అత్యుత్తమ, సంపూర్ణ ఉచిత పోషకాహారం తల్లిపాలేనని, తల్లిపాలు తాగే పిల్లల్లో భవిష్యత్తులో ఊబకాయం మరియు దీర్ఘకాలిక వ్యాధుల ప్రమాదం తగ్గుతుందని పేర్కొన్నారు. ఈ అవగాహన సదస్సులో ఆరోగ్య విస్తరణ అధికారి యం రాఘవయ్య, సూపర్‌వైజర్ ఆర్ భవానీ, ఏఎన్ఎం కీర్తి, అంగన్‌వాడీ కార్యకర్త భారతి, ఆశా కార్యకర్తలు రూపకళ, పద్మావతిలతో పాటు పెద్ద సంఖ్యలో బాలింతలు, గర్భిణులు, గ్రామ మహిళలు పాల్గొన్నారు.



# ఎస్సీ, ఎస్టీ కేసుల్లో ఉద్యోగాలు ఇవ్వాలి

**ఎస్సీ, ఎస్టీ రిలీఫ్ ఫండ్ కోటి రూపాయలు ప్రభుత్వం నుండి తెప్పించాలి**
**ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ కమిటీని నియమించాలి**
**మార్కాపురం జిల్లా జాయింట్ కలెక్టర్‌ను డిమాండ్ చేసిన దళిత నేత నీలం**

**(షణ్ముఖ వెలుగు, మార్కాపురం టౌన్, ఆగస్టు 1)**

మార్కాపురం జిల్లాలో పెండింగ్ ఎస్సీ, ఎస్టీ కేసుల్లో ప్రభుత్వ ఉద్యోగాలు ఇవ్వాలని, ఎస్సీ, ఎస్టీ పెన్షన్లు, భూములు, ఇళ్ల స్థలాలు ఇవ్వాలని జిల్లా జాయింట్ కలెక్టర్ పులి శ్రీనివాసులను దళిత హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షులు నీలం నాగేంద్రరావు డిమాండ్ చేశారు. శనివారం సాయంత్రం మార్కాపురం కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో ఎస్సీ, ఎస్టీ హత్య కేసులు, పునరావాసం పై చర్చించారు. అర్ధవీడు మండలం కాకర్ల గ్రామానికి చెందిన జుంజు మార్తమ్మ కంభం రైల్వే స్టేషన్లో ప్రైవేట్ స్వీపర్‌గా పనిచేస్తుందన్నారు. ఈ క్రమంలో మరొక బిసి మహిళతో కలిసి కల్తీ మద్యం తాగి మరణించిందన్నారు. కుట్ర పూర్వకంగా ఒక వ్యక్తి వీరిద్దరికీ కల్తీ మద్యం తాగించాడన్నారు. మాదిగ కులానికి చెందిన జుంజుమార్తమ్మ సోదరుడు రంగయ్య ఫిర్యాదు మేరకు రంగయ్య తమను ఆశ్రయించడంతో జిల్లా కలెక్టర్, ఎస్పీలకు ఫిర్యాదు చేసి 8 సంవత్సరాలుగా చట్టపరంగా పోరాటం చేసి అనేక ఆటంకాలు ఎదుర్కొని ఎట్టకేలకు జుంజు మార్తమ్మ మరణాన్ని ఐపిసి 304 హత్యగాని నరహత్యగా మార్పించామన్నారు. ఈ కేసులో ముద్దాయిలను పట్టుకోలేమని సిఐ రాజేష్ అన్ డిటెక్ట్ గా మార్చారన్నారు. ఎస్సీ, ఎస్టీ యాక్ట్ ప్రకారం ఎస్సీ, ఎస్టీల మరణాలను పోలీస్ అన్ డిటెక్టివ్‌గా చేస్తే ఎస్సీ, ఎస్టీ ఆక్ట్ వర్తిస్తుందని మార్కాపురం ఇన్చార్జి ఎస్పి పంపిన ఫైనల్ రిపోర్టు మేరకు జుంజు మార్తమ్మ కేసులో సోదరుడు రంగయ్యకు రిలీఫ్ ఎంప్లాయిమెంట్ ఇవ్వాలని జాయింట్ కలెక్టర్‌ను నీలం డిమాండ్ చేశారు. ఎర్రగొండపాలెంలో జరిగిన తూమాటి చెన్నమ్మ హత్య కేసు 2024 ఫిబ్రవరి 8 తేదీన జరిగిన రెండున్నర సంవత్సరం అయినా ఇంత వరకు ఎస్సీ, ఎస్టీ మంత్లీ పెన్షన్ ఇవ్వలేదన్నారు. అలాగే చెన్నమ్మ కుటుంబంలో ప్రభుత్వ ఉద్యోగం మనవడికి ఇవ్వవలసి ఉందన్నారు. అలాగే ఈ సంవత్సరం మార్కాపురం జిల్లా ఏర్పడిన రోజే జనవరి ఒకటవ తేదీన బేస్తవారిపేటలో జరిగిన జయంపు కృష్ణయ్య అను ఎస్టి యానాది కులస్తుడు హత్య కేసులో



సోదరుడు అల్లూరయ్యకు రిలీఫ్ కానీ, పెన్షన్ కానీ ఇవ్వలేదన్నారు. తర్లుపాడు తాసిల్దార్ నుంచి బాధిత కుటుంబానికి సంబంధించిన రిపోర్టు కూడా కలెక్టరేట్‌కు రాలేదన్నారు. దోర్నాల మండలం అయినముక్కల గ్రామం సంబంధించిన బొడ్డపాటి రాములమ్మ 2018లో హత్యకు గురైతే వారి కుటుంబంలో కూడా ప్రభుత్వ ఉద్యోగం మంజూరు చేయలేదన్నారు. ఎస్సీ, ఎస్టీ జీఓల ప్రకారం బాధిత కుటుంబాలకు ఇళ్ల స్థలాలతో పాటు ఐదు ఎకరాల ప్రభుత్వ భూమి ఇవ్వాలి లేదా రేటు భూములు కొనైనా ఇవ్వాలన్నారు. మార్కాపురం జిల్లాలో 12 ఎస్సీ, ఎస్టీ హత్య కేసులో పెన్షన్లు జిల్లా ఏర్పడినప్పటి నుండి ఇవ్వలేదన్నారు. అలాగే ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశం ఏర్పాటు చేయాలన్నారు. ఎస్సీ, ఎస్టీ రిలీఫ్ ఫండ్స్ కోటి రూపాయలు ప్రభుత్వం నుండి తెప్పించుకోవాలని జాయింట్ కలెక్టర్ పులి శ్రీనివాసులను దళిత నాయకులు డిమాండ్ చేశారు. జాయింట్ కలెక్టర్‌ను కలిసిన వారిలో మాల మహానాడు జిల్లా అధ్యక్షులు దారా అంజయ్య, కార్యదర్శి కాకుమాను రవి, మాదిగ పరిరక్షణ సమితి కార్యదర్శి పత్రా బంగారం, నూతలపాటి రాజు, జుంజు చినబాబు, తూమాటి చెన్నకేశవులు, తదితరులు ఉన్నారు.

# ఘనంగా తల్లిపాలు వారోత్సవాలు ప్రారంభం





**(షణ్ముఖ వెలుగు, కంభం, ఆగస్టు 1)**

కంభం గ్రామంలోని 63, 64, 65, 66, 67, 68 అంగన్వాడి కేంద్రాలలో ఆగస్టు ఒకటవ తేదీ నుండి ఏడో తేదీ వరకు తల్లిపాలు వారోత్సవాలు ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి బెస్తవారిపేట సీడీపీఓ కుమారి మరియు సూపర్వైజర్ సలోమి, స్వాతి మరియు అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. సీడీపీఓ కుమారి మాట్లాడుతూ తల్లిపాలే శిశువుకు తొలి టీకా–తొలి పోషకాహారం. పుట్టిన గంటలోపే తల్లిపాలు ఇవ్వడం మంచిది. మొదటి ఆరు నెలలు శిశువుకు తల్లిపాలు మాత్రమే సరిపోతాయి. నీరు కూడా అవసరం ఉండదు. తల్లిపాలలో శిశువును వ్యాధుల నుంచి కాపాడే ప్రతిరక్షకాలు (యాంటీబాడీలు) సమృద్ధిగా ఉంటాయి. తల్లిపాలు శిశువు మెదడు ఎదుగుదల, శారీరక పెరుగుదలకు ఎంతో ఉపయోగపడతాయి. తల్లిపాలు తాగే పిల్లల్లో ఇన్ఫెక్షన్లు, విరేచనాలు, శ్వాసకోశ సమస్యలు వచ్చే ప్రమాదం తక్కువగా ఉంటుంది. తల్లిపాలు ఇవ్వడం వల్ల తల్లి ఆరోగ్యానికి మేలు జరుగుతుంది. తల్లి–బిడ్డ మధ్య అనుబంధం మరింత బలపడుతుంది. ఆరు నెలల తర్వాత తల్లిపాలతో పాటు వయస్సుకు తగిన అనుబంధ ఆహారం ప్రారంభించి, రెండేళ్లు లేదా అంతకంటే ఎక్కువ కాలం తల్లిపాలు కొనసాగించడం మంచిది. తల్లిపాలు–బిడ్డకు అమృతం, తల్లికి ఆనందం. ప్రతి తల్లి తన బిడ్డకు తల్లిపాలు అందిద్దాం. "తల్లిపాలు–ప్రతి బిడ్డ హక్కు, ప్రతి తల్లి బాధ్యత". "తల్లిపాలే తొలి టీకా–ఆరోగ్యవంతమైన భవిష్యత్తుకు తొలి అడుగు". "తల్లిపాలు తాగిన బిడ్డ ఆరోగ్యంగా పెరుగుతాడు–సమాజం బలపడుతుంది." "ఆరోగ్యవంతమైన తరం కోసం తల్లిపాలను ప్రోత్సహిద్దాం అని సభా ముఖంగా ప్రసంగించారు. ఈ కార్యక్రమానికి అంగన్వాడి కార్యకర్తలు వి రమాదేవి, ఏ శారద, ఎంవి లక్ష్మీదేవి, వై పద్మావతి, భారతి, ఫాతిమా పిల్లల తల్లులు, తదితరులు పాల్గొన్నారు.

# ఘణంగా రాఘవ పుట్టినరోజు వేడుకలు



**(షణ్ముఖ వెలుగు, చిన్నగంజాం, ఆగస్టు 1)**

మండలంలోని కడవకుదురు గ్రామం నందు బాపట్ల జిల్లా తెదేపా కార్యదర్శి నక్కల వీరరాఘవులు జన్మదిన వేడుకలను తెలుగు యవత, నాయకులు, అభిమానుల అధ్వర్యంలో శనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. తమ అభిమాన నాయకుడు రాఘవతో భారీ కేక్ కట్ చేయించి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా రాఘవకు పుష్పాగుచ్చాలు అందించి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియాజేసారు. అనంతరం చిన్నగంజాం వాల్మీకి వృద్ధాశ్రమం నందు దుప్పట్లు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగు యవత, కోంద్రగుంట శ్రీహరిబాబు, రాఘవ అభిమాన సంఘం, మండల తెదేపా నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# అన్నాకు అదిరిపోయే జన్మదిన వేడుకలు




**63 కిలోల భారీ కేక్ కటింగ్‌తో**
**కార్యకర్తల కోలాహలం మధ్య పేదలకు అల్పహారం పంపిణి**
**భారిగా పాల్గొన్న కార్యకర్తలు, పట్టణ వైసిపి నాయకులు, అభిమానులు**

**(షణ్ముఖ వెలుగు, పొదిలి, ఆగస్టు 1)**

పొదిలి పట్టణంలో మార్కాపురం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్చార్జి, మాజీ ఎమ్మెల్యే అన్నరాంబాబు జన్మదిన వేడుకలు స్థానిక విశ్వనాధపురం సెంటర్లో నాయకులు, కార్యకర్తల కోలాహలం మధ్య అంబరాన్నంటాయి. మునుపెన్నడూ లేని విధంగా మాజీ వార్డు మెంబర్ ముల్లా భాష, జావిద్ (లడ్డు), ముల్లా యాసిన్ (చైనా) ఆధ్వర్యంలో 63 కిలోల భారీ కేక్‌ను ఏర్పాటు చేశారు. తొలుత కేక్ కటింగ్ నిర్వహించి అందరికీ అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన నాయకులు మాట్లాడుతూ పేదలకు అల్పాహార విందు ఏర్పాటు చేసి ప్రజలకు చేసిన సేవలు, ఆయన అంకితభావాన్ని కొనియాడారు. ఆయన నిండు నూరేళ్లుఆయురారోగ్య, ఐశ్వర్యలతో తలతూగాలని కొరుకున్నారు. ప్రస్తుతం మార్కాపురం నియోజకవర్గానికి ఆయన సేవలు అత్యవసరమని అభిప్రాయపడ్డారు. కార్యకర్తలను గుర్తెరిగి తాను ఒక కుటుంబ సభ్యుడిగా కలిసిపోయి ప్రజల కష్టసుఖాలలో పాలుపంచుకునే మనసున్న మారాజుగా అభివర్ణించారు. ఈ కార్యక్రమంలో పట్టణ నాయకులు సానికొమ్ము శ్రీనివాసరెడ్డి, సాయి రాజేశ్వరరావు, వై వెంకటేశ్వరరావు, జి శ్రీను, మెట్టు వెంకటరెడ్డి, చోటా ఖాశీం, మందలపు శ్రీనివాసరెడ్డి (సిసికెఆర్), కోవెలకుంట్ల నరసింహారావు, షేక్ రబ్బాని, ఆరిజ్, మన్సూర్, బాజీ సబ్బులు, రియాజ్, ముల్లా షాహీద్, సంథాని, యస్థాని, జానీ, కరిముల్ల, ముల్లా మునీర్, యస్థాన్, రబ్బాని, మస్తాన్ సర్వీస్ పాయింట్, తదితరులు పాల్గొన్నారు.





# 96వ బూత్‌లో వైభవంగా ఇంటింటికీ తెలుగుదేశం

**ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ ఆదేశాలతో**
**ఇంటింటికి టీడీపీ నాయకులు**
**కూటమి ప్రభుత్వ సంక్షేమం, అభివృద్ధిని వివరించిన నాయకులు**







**(షణ్ముఖ వెలుగు, మైదుకూరు, ఆగస్టు 1)**

మైదుకూరు ఎమ్మెల్యే పుట్ట సుధాకర్ యాదవ్ ఆదేశాల మేరకు, మైదుకూరు పట్టణ పరిధిలోని 96వ బూత్‌లో 'ఇంటింటికీ తెలుగుదేశం' కార్యక్రమం శనివారం అత్యంత ఉత్సాహపూరిత వాతావరణంలో ఘనంగా జరిగింది. డీలర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సొక్కం శివ, యూనిట్ కోకన్వీనర్ భూమిరెడ్డి రమణ నేతృత్వంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు గడప గడపకూ తిరిగారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఎమ్మెల్యే పుట్ట సుధాకర్ యాదవ్ దిశానిర్దేశంలో కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, నియోజకవర్గంలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, పాలనా పురోగతిని ప్రజలకు స్పష్టంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు, కనీస వేతనాల సలహామండలి డైరెక్టర్ దాసరి బాబు, మాజీ ఎంపీపీ, రాష్ట్ర తెలుగు రైతు ఉపాధ్యక్షుడు ధనపాల జగన్, సొసైటీ బ్యాంకు చైర్మన్ పాశం మారుతి, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ బి.ఎన్. శ్రీనివాసులు, క్లస్టర్ ఇంచార్జ్ ఆకుల క్రిష్ణయ్య, కేసీ కెనాల్ డైరెక్టర్ చిలుంగారి పుల్లయ్య, నాయకులు ధనపాల రవి, ధనపాల యుగంధర్, షరీఫ్, వీరారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# ప్రత్యేక కార్యచరణతోనే ప్లాస్టిక్ నిర్మూలన సాధ్యం

**జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత**




**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, ఆగస్టు 1)**

సమాజాన్ని పట్టిపీడిస్తున్న ప్లాస్టిక్ భూతాన్ని నిర్మూలించాలంటే ప్రత్యేక కార్యచరణ తోనే అది సాధ్యమవుతుందని జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత తెలిపారు. శనివారం మార్కాపురంలోని కలెక్టరేట్లో 'ఇంప్లిమెంటేషన్ ఆఫ్ ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్మెంట్' పై మార్కాపురం మున్సిపాలిటీ సిబ్బంది, జిల్లాలోని ఎన్జీవో ప్రతినిధులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యంగా జిల్లా కేంద్రమైన మార్కాపురం పట్టణంలో ప్లాస్టిక్ ను నిర్మూలించేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. విచ్చలవిడిగా వాడుతున్న ప్లాస్టిక్ తో భావితరాలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొనే అవకాశం ఉందన్నారు. అక్టోబర్ రెండో వారం నాటికి ప్లాస్టిక్ ని తగ్గించేందుకు విడతల వారీగా కార్యాచరణ సిద్ధం చేస్తున్నామన్నారు. దీనికి ఎన్జీవోల సహకారం ఉంటే చక్కని ఫలితాలు వస్తాయని కలెక్టర్ వివరించారు. ప్రజలు సైతం ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ పులి శ్రీనివాసులు, మున్సిపల్ కమిషనర్ నారాయణరావు, జిల్లాలోని ఎన్జీవో ప్రతినిధులు పాల్గొన్నారు.